విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందరి హక్కు...
# పెన్ సత్తా
PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 311 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 3 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# అమరావతి.. అఖండ దీప్తి



**మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించిన రాజ్యసభ**
**రాష్ట్రపతి ఆమోదం పొందిన వెంటనే చట్టరూపం**
**149 నిమిషాలపాటు చర్చ**
**10 పార్టీల నుంచి మాట్లాడిన 16 మందీ మద్దతు**
**వ్యతిరేకించి, వాకౌట్ చేసిన వైకాపా**

### ఉభయ సభల్లో 260 నిమిషాల చర్చ

**బుధవారం లోక్‌సభలో 111 నిమిషాలపాటు జరిగిన చర్చలో 11 పార్టీల నుంచి 18 మంది, గురువారం రాజ్యసభలో 149 నిమిషాలపాటు జరిగిన చర్చలో 11 పార్టీల నుంచి 17 మంది సభ్యులు మాట్లాడారు. ఉభయసభల్లో కలిపి 260 నిమిషాలపాటు జరిగిన చర్చల్లో 35 మంది మాట్లాడారు. వైకాపాకు చెందిన ఇద్దరు తప్ప అధికార, ప్రతిపక్షాల్లోని పార్టీలు, తటస్థంగా ఉన్న పార్టీలు కూడా అమరావతిపట్ల అభిమానాన్ని కనబరిచాయి.**

అమరావతిని పెద్దల సభ ఆశీర్వదించింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడానికి కేంద్ర హోం శాఖ తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు–2014 సవరణ బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. భవిష్యత్తులో వచ్చే ఏ ప్రభుత్వాలూ రాజధానిపై పిల్లిమొగ్గలేసి ప్రజాజీవితాలతో ఆడుకోకూడదన్న బలమైన సందేశాన్నిచ్చింది. బుధవారం లోక్‌సభ ఆమోదం పొందిన బిల్లును గురువారం మధ్యాహ్నం హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ దీనిపై చర్చకు అనుమతిచ్చారు. తొలుత ఇందుకు రెండు గంటలే కేటాయించినా సభ్యుల ఉత్సాహంతో అది 149 నిమిషాలపాటు సాగింది. కాంగ్రెస్, భాజపా సహా మొత్తం 11 పార్టీల నుంచి 17 మంది సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అందులో 10 పార్టీలకు చెందిన 16 మంది సభ్యులు ముక్తకంఠంతో అమరావతి బిల్లును స్వాగతించి ఆశీర్వదించారు. వైకాపా నుంచి మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి మాత్రం ఆరోపణలు చేసి వాకౌట్ చేశారు. మిగతా పార్టీల సభ్యులు ప్రాంతాలు, పార్టీలనే భేదం లేకుండా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. విభజన నాటి నష్టం ఇప్పటికైనా భర్తీ అవుతోందని సంతోషించారు. గత ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొని రైతులు, మహిళలు శాంతియుత ఉద్యమాలు నిర్వహించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటినందుకు ముక్తకంఠంతో అభినందించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దిన ఆయన హయాంలో అమరావతి కూడా

- మిగతా2లో

## ఐదు కోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు

### ఈ విజయం చిరస్మరణీయం
### సహకరించిన పార్టీలకు రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు
### దిల్లీలో విలేకర్లతో మంత్రి నారా లోకేశ్



'ఈ రోజు చరిత్రలో నిలిచే రోజు.. ఐదు కోట్ల ఆంధ్రులు, అమరావతి రైతులు, మహిళలు గెలిచిన రోజు' అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించిన తర్వాత ఆయన దిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. 'ఒక్క టీమ్– 11 పార్టీ తప్ప దేశమంతా ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలబడింది. ఈరోజు రాజ్యసభలో సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఐదేళ్లు నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అమరావతికి జై కొట్టారు. ఇందుకు రాష్ట్ర ప్రజలంతా గర్వపడాలి. దేశమంతా మాపై ఉంచి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. తప్పనిసరిగా అమరావతి పనులు పూర్తి చేస్తాం. ప్రధాన మంత్రి మోదీని ఆహ్వానించి నూతన రాజధానికి రిబ్బన్ కటింగ్ చేయించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. ఐదు కోట్ల మంది ఆంధ్రులు గర్వపడేలా అమరావతితోపాటు అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తాం.

- మిగతా2లో




## ఇరాన్‌తో యుద్ధం వేళ.. అమెరికా సైన్యంలో సంచలనం!

- యూఎస్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ రాండీ జార్జ్‌పై వేటు
- తక్షణమే పదవి వీడాలని ఆదేశించిన రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్
- ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న కీలక తరుణంలో ఈ పరిణామం
- ట్రంప్ విజన్‌కు అనుగుణంగానే ఈ నిర్ణయమని విశ్లేషణలు
- యాక్టింగ్ చీఫ్‌గా జనరల్ క్రిస్టోఫర్ లానేవ్ నియామకం

- మిగతా2లో

## అమరావతిపై జగన్ విద్వేషానికి పరాకాష్ఠ 'మావిగన్'

### త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్
### ఎన్డీయే నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు




రాజధాని అమరావతిపై జగన్‌కున్న విద్వేషానికి 'మావిగన్' అని మాట్లాడటం పరాకాష్ఠ అని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి ఇప్పుడు కూడా అమరావతిపై విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. అందుకే వింత పేరు మావిగన్‌ను తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు. గతంలోనూ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం పేరు

- మిగతా2లో

## అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ.. వాకౌట్ చేస్తున్నాం

### రాజ్యసభలో వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



అమరావతి బిల్లును రాజ్యసభలో వైకాపా వ్యతిరేకించి వాకౌట్ చేసింది. రాజ్యసభలో గురువారం జరిగిన చర్చలో ఆ పార్టీ తరఫున మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి బుధవారం లోక్‌సభలో పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగంలోని అంశాలనే దాదాపుగా మళ్లీ ప్రస్తావించి తాము ప్రస్తుత రూపంలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. వైకాపా అధినేత జగన్ రాజధాని గురించి కొత్తగా చేసిన వ్యాఖ్యలను ఇందులో ప్రస్తావించారు. 'ఈ బిల్లులో రాజధాని అంటే ఏంటో నిర్వచించలేదు.

- మిగతా2లో



## మళ్లీ జాబిల్లి దరికి..

- విజయవంతంగా నింగిలోకి ఆర్టెమిస్-2 ప్రయోగం
- ఎగువ భూ కక్ష్యలోకి చేరిన వ్యోమగాములు

కేప్ కెనవెరాల్: అల్లంత దూరం నుంచి మానవాళికి కనువిందు చేసే అందాల జాబిల్లిపై పరిశోధనల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. ఐదు దశాబ్దాలకుపైగా సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ చందమామ వైపు మానవసహిత

- మిగతా2లో

## హర్మూజ్‌పై దృష్టి

- తెరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమాలోచన
- భారత్ సహా 40 దేశాలతో బ్రిటన్ సంప్రదింపులు
- ఇరాన్‌లో అంతా అయిపోయిందన్న ట్రంప్
- అయినా మరింత తీవ్ర దాడులు తప్పవని స్పష్టీకరణ
- ఇంకా చాలా ఆయుధాలున్నాయన్న ఇరాన్
- లెబనాన్‌లో భూతల పోరు ఉద్ధృతం



దుబాయ్: ప్రపంచ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న హర్మూజ్ జల సంధి మూసివేత అంశంపై ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి. దానిని తెరిపించేందుకు బ్రిటన్ నాయకత్వంలో దాదాపు 40 దేశాలు సమాలోచనలు జరుపుతున్నాయి. ఇందులో భారత్ తరఫున విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిస్రీ పాల్గొంటున్నారు. మరోవైపు ఇరాన్‌లో అంతా అయిపోయిందని, ఏమీ మిగల్లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. దీనికి ప్రతిగా తమవద్ద రహస్య ప్రాంతాల్లో ఆయుధాలున్నాయని ఇరాన్ స్పష్టం చేసింది. లెబనాన్‌లో భూతల పోరాటం ఉద్ధృతమైంది. ఇజ్రాయెల్, గల్ఫ్‌పై ఇరాన్ దాడులు చేసింది. ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ బాంబులు వేసింది.

- మిగతా2లో

## ఇక అజేయం

### రాష్ట్ర ప్రజలు సంబరాలు చేసుకునే తరుణమిది
### ప్రధాని, సీఎంకు ధన్యవాదాలు తెలిపేలా దీపాలు వెలిగించండి
### ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు

**త్యాగాలను చూసిన నేల నుంచి ఆశలను మోసిన కన్నీటి నుంచి అనిశ్చితిని తట్టుకున్న నిశ్శబ్దం నుంచి లక్షలాది ఆకాంక్షలను మోస్తూ అమరావతి ఆత్మగౌరవంతో మళ్లీ లేస్తోంది.**
**ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**



రాష్ట్ర రాజధానిగా అమరావతి ఇక అజేయమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ఉభయసభల్లోనూ ఆమోదం పొందడం శుభపరిణామమని, ఏపీ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని అన్నారు. ఏపీకి ఏకైక,

- మిగతా2లో

# అమరావతి.. అఖండ దీప్తి

-మొదటిపేజీ తరువాయి
అత్యుత్తమ నగరంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తున్న హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్**

రేణుకాచౌదరి ప్రసంగంతో ప్రారంభం: కాంగ్రెస్ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రసంగంతో చర్చ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, భాజపా ఎంపీలు కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, పాకా వెంకట సత్యనారాయణ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్ హఖ్, ఆప్ నేతలు సంజయ్‌సింగ్, సందీప్‌కుమార్ ఝా, వైకాపా నాయకుడు వైవీ సుబ్బారెడ్డి, బీజేడీ సభ్యుడు నిరంజన్ బిసి, ఆర్జేడీ సభ్యుడు సంజయ్‌యాదవ్, భారాస ఎంపీలు కేఆర్ సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, జేడీయూ నేత సంజయ్‌కుమార్ ఝా, తెదేపా సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్, సానా సతీష్‌బాబు, శివసేన ఉద్ధవ్‌ఠాక్రే సభ్యురాలు ప్రియాంకా చతుర్వేదిలు మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి తప్ప మిగతా అందరూ ఆంధ్రప్రదేశ్‌కు సంఘీభావం ప్రకటించారు. తెలుగుజాతి గొప్పతనం, కష్టాలను అధిగమించే తత్వాన్ని కొనియాడారు. ప్రస్తుతం కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెదేపా బలంపైనే ఆధారపడి ఉన్నందున ఒత్తిడి తెచ్చి నిధులు సాధించుకోవాలని సూచించారు. మరికొందరు సభ్యులు భాజపా మోసగించే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. అమరావతి నిర్మాణానికి నిర్దిష్ట గడువు విధించి పూర్తి చేయాలని, భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**దేశ ప్రజల తరపున శుభాకాంక్షలు: రాజ్యసభ ఛైర్మన్**

చివరగా హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ సమాధానం ఇస్తూ బిల్లు ఉద్దేశాన్ని వివరించారు. దానివల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగే ప్రయోజనాల్ని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రూపంలో కొత్త రాజధాని లభించినందుకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి సంకల్పంచిన వికసిత్ భారత్ లక్ష్యాన్ని పూర్తి చేయడంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్ సార్థక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. ఇదో చరిత్రాత్మక సందర్భమని అభివర్ణించారు. ఆ వెంటనే రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ బిల్లుపై అభిప్రాయం కోరగా సభ్యులంతా గట్టిగా నినదిస్తూ ముక్తకంఠంతో మద్దతు పలికారు. దాంతో ఛైర్మన్ బిల్లు సభామోదం పొందినట్లు ప్రకటించారు. అన్ని పక్షాల సభ్యులు కరతాళధ్వనులతో హర్షం ప్రకటించారు. తర్వాత రాజ్యసభ ఛైర్మన్ మాట్లాడుతూ మొత్తం సభ, దేశ ప్రజల తరపున ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదంతో అద్భుతమైన నూతన రాజధాని నిర్మాణం కావాలని అభిలషించారు. అమరావతి బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించినందున రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపిన వెంటనే అది చట్టరూపం సంతరించుకుంటుంది. 2024 జూన్ 2 నుంచి అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా గుర్తింపు పొందుతుంది. ఇలా ఒక రాష్ట్ర రాజధానికి ప్రత్యేకంగా చట్టపరమైన హోదా ఇవ్వడం ఇదే ప్రథమం.

**గ్యాలరీలో కూర్చొని చర్చను పరిశీలించిన లోకేశ్:**

అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పెట్టి ఆమోదిస్తున్న వేళ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలపడానికి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ దిల్లీకి వచ్చారు. గురువారం ఆయన తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, మిగతా ఎంపీలతో కలిసి రాజ్యసభ గ్యాలరీలో కూర్చొని మొత్తం చర్చను వీక్షించారు. బిల్లు పాసైనట్లు రాజ్యసభ ఛైర్మన్ ప్రకటించగానే వారంతా గ్యాలరీలోంచి లేచి సభకు, ఛైర్మన్‌కు నమస్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత ఛైర్మన్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు లోకేశ్.. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, అమరావతి బిల్లుకు మద్దతిచ్చిన వివిధ పార్టీల నేతలను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

# హర్మ్యూజ్‌పై దృష్టి

బ్రిటన్ జరుపుతున్న ప్రయత్నాల్లో రాజకీయ, దౌత్య పరిష్కారాలు ప్రధానంగా ఉన్నాయి. అయితే సైనిక చర్య అంశమూ కొన్ని దేశాల పరిశీలనలో ఉందని బ్రిటన్ విదేశాంగ మంత్రి వెట్ కూపర్ తెలిపారు. హర్మ్యూజ్‌ను తెరిపించడానికి సైనిక చర్య చేపట్టడం అవాస్తవికంగా ఉందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్పష్టం చేశారు.

హర్మ్యూజ్‌ను తెరిపించడానికి పలువురు భాగస్వాములతో చర్చలు జరుపుతున్నామని చైనా వెల్లడించింది. ఈ జల సంధిలో రవాణా పునరుద్ధరణ అవసరాన్ని గుర్తించాలని, దీనిపై అందరూ కృషి చేయాలని పేర్కొంది.

హర్మ్యూజ్‌ను తెరిపించడంపై అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నామని దక్షిణ కొరియా తెలిపింది.

**ఒక్కరూ మిగలరు**

తమపై భూతల పోరుకు దిగితే ప్రత్యర్థుల్లో ఒక్కరూ మిగలరని ఇరాన్ మేజర్ జనరల్ ఆమిర్ హతామీ స్పష్టం చేశారు. - తమవద్ద రహస్య ప్రాంతంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి భారీగా ఉందని ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు. మేం ఆయుధాలు తయారుచేసే ప్రాంతాల గురించి అమెరికాకు తెలియదని స్పష్టం చేశారు. - యుద్ధంలో పోరాడటానికి 70 లక్షల మంది సిద్ధంగా ఉన్నారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఖలీబ్ స్పష్టం చేశారు.

**మాజీ మంత్రిపై దాడి**

ఇరాన్‌పై జరిగిన వైమానిక దాడిలో ఆ దేశ మాజీ మంత్రి కమల్ ఖరాజీ (81) తీవ్రంగా గాయపడ్డారు. గతంలో ఆయన ఇరాన్‌కు అణ్వాయుధం ఉండాల్సిందేనని స్పష్టం చేసేవారు. వైమానిక దాడిలో ఖరాజీ భార్య మరణించగా.. ఆయన తీవ్రంగా గాయపడ్డారు. నీ ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. శతాబ్ద కాలం నాటి వైద్య కేంద్రంపై, వంతెనపై, స్టీల్ ప్లాంట్లపై ఈ దాడులు జరిగాయి. నీ లెబనాన్‌లో భూతల పోరాటం ఉద్ధృతమైంది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నలుగురు మృతి చెందారు. నీ ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ గురువారం మరిన్ని క్షిపణులను ప్రయోగించింది. ట్రంప్ హెచ్చరికలకు ప్రతిస్పందనగా తమవద్ద ఇంకా ఆయుధాలున్నాయని చెబుతూ ఈ దాడులు చేసింది. నీ దుబాయ్‌లో ఇరాన్ క్షిపణులను రక్షణ వ్యవస్థలు అడ్డుకున్న సందర్భంగా భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. నీ బహ్రెయిన్, ఇజ్రాయెల్‌లలోనూ సైరన్లు మోగాయి. నీ బాగ్దాద్ సెంట్రల్‌పై రానున్న 48 గంటల్లో తీవ్ర దాడులు జరిగే అవకాశముందని అమెరికా ఎంబసీ హెచ్చరించింది.అమెరికా పౌరులు, వ్యాపారాలు, వర్సిటీలు, దౌత్య కార్యాలయాలు, ఇంధన మౌలిక వసతులు, హోటళ్లు, విమానాశ్రయాలు లక్ష్యంగా ఈ దాడులు జరగవచ్చని పేర్కొంది. నీ ఇరాన్‌పై దాడులను ఐర్లాండ్ ప్రధాని మైఖేల్ మార్టిన్ విమర్శించారు. ఇది రాతి యుగానికి మళ్లడమేనని స్పష్టం చేశారు.

**ఇరాన్ పునర్నిర్మాణానికి నడుం బిగించండి: మొజ్తాబా**

అమెరికా- ఇజ్రాయెల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ మండిపడ్డారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన సందేశం విడుదల చేశారు. అమెరికా- ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్‌లో మౌలిక సదుపాయాలతోపాటు పర్యావరణం దెబ్బతిందని తెలిపారు.

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ అమెరికా ప్రజలను ఉద్దేశిస్తూ బహిరంగ లేఖ రాశారు. తమకు అమెరికన్లపై ఎలాంటి శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. అనేకసార్లు ఒత్తిళ్లు, ఆంక్షలు ఎదురైనప్పటికీ.. తాము ఎన్నడూ యుద్ధానికి దిగలేదని తెలిపారు. తమపై చేస్తున్న దాడులను దృఢంగా, ధైర్యంగా తిప్పికొడుతున్నామని స్పష్టం చేశారు. ?య ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదన్న ట్రంప్ లక్ష్యాలకు తమ మద్దతు ఉంటుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ పేర్కొన్నారు. అలాగే, యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో సాధించాల్సింది ఇంకా ఏముందని ఆయన ప్రశ్నించారు. ?య పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక వివరాలను వెల్లడించింది. భారత మిత్రులు సురక్షితంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

ఇరాన్ సుప్రీం లీడర్‌కు భారత్‌లో ప్రతినిధిగా ఉన్న అబ్దుల్ మజీద్ హకీం ఇలాహి మన దేశంపై ప్రశంసలు కురిపించారు. నమ్మకానికి, మానవత్వానికి భారత్ నిలయమని కొనియాడారు. యూపీలోని లఖ్‌నవూలో ఆయతుల్లా ఖమేనీ సంతాప సభను ఏర్పాటు చేయగా, అందులో హకీం ఇలాహి పాల్గొన్నారు.

**త్వరలో ముగిస్తాం: ట్రంప్**

ఇరాన్ యుద్ధాన్ని త్వరలోనే ముగిస్తామని ట్రంప్ తెలిపారు. కీలక వ్యూహాత్మక లక్ష్యాలు పూర్తికావడానికి ఎంతో సమయం పట్టదని వెల్లడించారు. యుద్ధం ప్రారంభమయ్యాక తొలిసారిగా బుధవారం రాత్రి ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరాన్‌లో అంతా అయిపోయిందని, కానీ మరికొంత కాలం దాడులు కొనసాగుతాయని వెల్లడించారు. 'రానున్న రెండు మూడు వారాల్లో అత్యంత తీవ్ర దాడులను ఇరాన్ ఎదుర్కోవాల్సి వస్తుంది. మళ్లీ వారిని రాతి యుగంలోకి పంపేస్తాం. వారు ఆ యుగానికి చెందినవారే' అని పేర్కొన్నారు.

# మళ్లీ జాబిల్లి దరికి..

యాత్ర ప్రారంభమైంది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ- నాసాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'ఆర్టెమిస్-2' మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములతో కూడిన రాకెట్ కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి భారత కాలమానం ప్రకారంగురువారం తెల్లవారుజామున నింగిలోకి దూసుకెళ్లింది. ఈ వ్యోమగాములు దాదాపు 25 గంటలపాటు భూమి చుట్టూ పరిభ్రమించి.. అనంతరం జాబిల్లి దిశగా ప్రయాణాన్ని మొదలుపెట్టనున్నారు. 10 రోజులపాటు సాగే ఈ యాత్రలో భాగంగా.. వారు చంద్రుడిని దాటి ఆవల కూడా వేల కిలోమీటర్లు ప్రయాణిస్తారు. మొత్తంగా 4 లక్షల కిలోమీటర్లకుపైగా దూరం వెళ్లాక యూటర్న్ తీసుకొని భూమికి తిరిగొస్తారు. ఈ మిషన్‌లో వ్యోమగాములు జాబిల్లిపై కాలు మోపరు. చందమామపై మళ్లీ మానవులను దించాలని, అక్కడ మానవ శాశ్వత ఉనికిని ఏర్పాటుచేయాలని నాసా రచిస్తున్న బృహత్ ప్రణాళికలకు ఆర్టెమిస్-2 ఆరంభం వంటిది. 2028 కల్లా చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద తమ వ్యోమగాములను దించాలని ఆ సంస్థ భావిస్తోంది.

**ఉత్కంఠ క్షణాలను దాటి..**

ఆర్టెమిస్-2 మిషన్‌లో భాగంగా శక్తిమంతమైన స్పేస్ లాంచ్ సిస్టమ్ (ఎస్ఎల్ఎస్) రాకెట్.. నలుగురు వ్యోమగాములున్న ఒరాయన్ క్యాప్సూల్‌తో ఫ్లోరిడాలో కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. వేలమంది గుమిగూడి ఈ ప్రయోగాన్ని వీక్షించారు. 1960లు, 70ల నాటి అపోలో యాత్రలను ఆర్టెమిస్-2 గుర్తుకుతెచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో కౌంట్‌డౌన్ పరీక్ష వేళ ఎస్ఎల్ఎస్‌లో ప్రమాదకర హైడ్రోజన్ లీకేజీ సమస్య తలెత్తింది. దీంతో గురువారం మళ్లీ అలాంటి ఇబ్బందేమైనా ఎదురవుతుందేమోనన్న ఆందోళన కొంత శాస్త్రవేత్తల్లో కనిపించింది. అదేమీ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఎల్ఎస్‌లో 26 లక్షల లీటర్ల ఇంధనాన్ని నింపారు. ఇంధనం లీక్ కాకపోయినప్పటికీ.. ప్రయోగం చివరి క్షణాల్లో బ్యాటరీ సెన్సర్లు సరిగా పనిచేయకపోవడం, రాకెట్ ఫ్లైట్ టర్మినేషన్ సిస్టమ్‌కు ఆదేశాలు అందకపోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాటిని శాస్త్రవేత్తలు సత్వరమే సరిచేయడంతో.. ప్రయోగం సాఫీగా సాగింది. ప్రయోగం తర్వాత కొద్దిసేపు మొరాయించిన టాయిలెట్.. తర్వాత తిరిగి పనిచేయడం ప్రారంభించింది.

**భూమి చుట్టూ ఒకరోజు**

నింగిలోకి దూసుకెళ్లాక దాదాపు గంట ప్రయాణం తర్వాత వ్యోమగాములు ఎగువ భూ కక్ష్యలోకి ప్రవేశించారు. ఒకరోజు పాటు వారు పుడమి చుట్టూ పరిభ్రమిస్తారు. ఓరియన్ క్యాప్సూల్ ప్రధాన ఇంజిన్‌ను శుక్రవారం మండిస్తారు. దీంతో అది గురుత్వాకర్షణ శక్తిని తప్పించుకొని.. చంద్రుడి దిశగా ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఎగువ భూ కక్ష్యలో వ్యోమగాములు క్యాప్సూల్‌ను పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకొని పరీక్షిస్తారు.

**జాబిల్లి ఆవలకు..**

ఒరాయన్ క్యాప్సూల్ వచ్చే సోమవారం చంద్రుడికి అత్యంత చేరువగా వెళ్తుంది. ఆ సమయంలో వెలుతురు బాగుంటే.. వ్యోమగాములు జాబిల్లిని నిశితంగా చూడొచ్చు. చంద్రుడికి ఆవల 6,400 కిలోమీటర్ల వరకూ వారు వెళ్తారు. దీంతో- భూమి నుంచి అత్యంత ఎక్కువ దూరం వెళ్లిన వ్యక్తులుగా ఆర్టెమిస్-2 వ్యోమగాములు రికార్డు పుటల్లోకెక్కుతారు. జాబిల్లి ఆవలకు వెళ్లాక వెనుదిరిగి నేరుగా పసిఫిక్ మహాసముద్రంలో వారు దిగుతారు. ఈ మిషన్‌లో వారు సూర్యగ్రహణాన్నీ కళ్లజోళ్ల సాయంతో వీక్షిస్తారు. 53 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చేపట్టిన తొలి మానవసహిత చంద్రమండల యాత్ర ఇది.

మానవరహిత ఆర్టెమిస్-1 మిషన్‌ను నాసా 2022 నవంబరులో చేపట్టింది. అయితే అందులో లైఫ్ సపోర్ట్ సాధనాలు, వాటర్ డిస్పెన్సర్, టాయిలెట్ వంటి సదుపాయాలు లేవు. ఆర్టెమిస్-2లో వాటిని జోడించారు.

ఆర్టెమిస్-2 కమాండర్‌గా రీడ్ వైస్‌మాన్ వ్యవహరిస్తున్నారు. ఆయనతో పాటు పైలట్ విక్టర్ గ్లోవర్, మరో ఇద్దరు వ్యోమగాములు క్రిస్టీనా కోచ్, జెరెమీ హాన్సన్ ఈ మిషన్‌లో భాగంగా నింగిలోకి దూసుకెళ్లారు. వీరిలో హాన్సన్ మినహా మిగతా ముగ్గురూ అమెరికన్లే. జాబిల్లి దిశగా చేపట్టిన మానవసహిత యాత్రలో పాలుపంచుకున్న తొలి మహిళగా క్రిస్టీనా కోచ్ రికార్డు సృష్టించారు.

# ఇరాన్‌తో యుద్ధం వేళ.. అమెరికా సైన్యంలో సంచలనం!

అమెరికా సైన్యంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. యూఎస్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ రాండీ జార్జ్‌ను తక్షణమే పదవి నుంచి వైదొలగాలని రక్షణ కార్యదర్శి పీట్ హెగ్?సెత్ ఆదేశించారు. ఇరాన్‌తో అమెరికా యుద్ధం కొనసాగుతున్న కీలక తరుణంలో ఆర్మీ అత్యున్నత అధికారిపై వేటు వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జనరల్ జార్జ్ వెంటనే పదవీ విరమణ చేస్తున్నారని పెంటగాన్ అధికారికంగా ధ్రువీకరించింది.అయితే, జార్జ్‌ను అర్ధాంతరంగా తొలగించడానికి గల కచ్చితమైన కారణాలను పెంటగాన్ వెల్లడించలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సైన్యంలో ఉండాలని హెగ్?సెత్ భావిస్తున్నారని, అందుకే ఈ మార్పులు చేస్తున్నారని కథనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా నాలుగేళ్ల పదవీకాలం ఉండగా, 2023లో బాధ్యతలు చేపట్టిన జార్జ్ కేవలం 18 నెలల్లోనే వైదొలగాల్సి వచ్చింది.గతేడాది హెగ్?సెత్ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సైన్యంలో ఉన్నతస్థాయి అధికారుల తొలగింపు పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆయన డజనుకు పైగా ఉన్నతాధికారులను పదవుల నుంచి తప్పించారు. జార్జ్ స్థానంలో ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ క్రిస్టోఫర్ లానేవ్ యాక్టింగ్ చీఫ్‌గా వ్యవహరించనున్నారు. లానేవ్ గతంలో హెగ్?సెత్‌కు టాప్ మిలిటరీ ఎయిడ్‌గా పనిచేయడం గమనార్హం. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాల్లో పనిచేసిన అనుభవజ్ఞుడైన జార్జ్‌ను తొలగించడం అమెరికాలో చర్చనీయాంశంగా మారింది.

# అమరావతిపై జగన్ విద్వేషానికి పరాకాష్ఠ 'మావిగన్'

-మొదటిపేజీ తరువాయి
ఎస్ఆర్ఎం అమరావతిగా ఉంటే అందులో నుంచి అమరావతి పేరును తీసేయించారని పేర్కొన్నారు. ఎన్డీయే ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'రాజధాని అమరావతి రాష్ట్ర ప్రజలకు ఒక సెంటిమెంట్. అది మన రాజధాని అనే భావన ప్రతి ఒక్కరిలోనూ రావాలి. అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలపాలి. రాష్ట్ర రాజధానికి స్థిరత్వం వచ్చేలా సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, మద్దతు తెలిపిన వివిధ పార్టీల నేతలకు కృతజ్ఞతలు. రాష్ట్రాభివృద్ధి సవ్యంగా సాగాలని అందరూ సంకల్పం తీసుకోవాలి. అన్ని రాష్ట్రాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకెళుతోంది. కర్నూలులో త్వరలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

**ఇది ఆంధ్రప్రదేశ్ విజయం: నాదెండ్ల మనోహర్**

బిల్లు ఆమోదం పొందడం సంతోషకరమైన విషయమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇది సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయమని అభివర్ణించారు. టెలికాన్ఫరెన్స్‌లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు.

# అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ.. వాకౌట్ చేస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి
రాజ్యాంగంలో దేశ రాజధాని ప్రస్తావన ఉంది తప్పితే రాష్ట్రాల రాజధానుల గురించి లేదు. కేంద్ర ప్రభుత్వం ఇదివరకు హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోనూ రాజధానిపై నిర్ణయం తీసుకునే హక్కు రాష్ట్రాలకే ఉంటుందని చెప్పింది. అలాంటప్పుడు ఈ బిల్లును కేంద్ర హోంమంత్రి ఏ ఆధారంగా తీసుకొచ్చారు? ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల విషయాల్లో ఇలాంటి నిర్ణయాలు తీసుకోకుండా ఆంధ్రప్రదేశ్ విషయంలోనే ఎందుకు తీసుకుంటున్నారు? ఇది ప్రజలను రెచ్చగొట్టడం కాదా? అందువల్ల మేం ప్రస్తుత రూపంలో బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేస్తున్నాం' అని వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు.

# ఐదు కోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు

-మొదటిపేజీ తరువాయి
అమరావతి తొలి దశ రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లుగా నిర్ణీత సమయంలోపే పూర్తవుతుంది. ఆ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు ప్రధానిని పిలుస్తాం' అని లోకేశ్ ప్రకటించారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించిన అనంతరం కూటమి ఎంపీలు, రాజ్యసభ సభ్యులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని సన్మానించిన మంత్రి లోకేశ్

**ప్రధాని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు**

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ టీమ్-11 అనేక దుష్ప్రచారాలు చేసింది. మళ్లీ అధికారంలోకి వస్తే 3 రాజధానులు చేస్తామని చెబుతూ వచ్చింది. వారి తప్పుడు ప్రచారంతో రాష్ట్రానికి, అమరావతికి రావాల్సిన పెట్టుబడులు నెమ్మదించాయి. ఇప్పటికే చాలా నష్టపోయాం.. మా భవిష్యత్తు ఏమిటని రైతులూ ఆందోళన చెందారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఏకైక రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని వారంతా కోరారు. దీంతో శాసనసభను ప్రత్యేకంగా సమావేశపరిచి, రోజంతా చర్చించాం. అమరావతే శాశ్వత రాజధానిగా ఉండాలని ఏకగ్రీవంగా తీర్మానించి పార్లమెంటుకు పంపించాం. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలు చొరవ తీసుకొని దాన్ని సాకారం చేశారు. అమరావతిని, 5 కోట్ల ఆంధ్రులను కాపాడింది పార్లమెంటే. అందుకే బిల్లు ఆమోదం పొందినట్లు ప్రకటించిన వెంటనే లేచి నిలబడి పార్లమెంటుకు నమస్కరించాం. రైతులు, మహిళలు చేసిన పోరాటం ఫలించింది. ఇక అభివృద్ధి దిశగా ముందుకెళ్లబోతున్నాం. ఇక ఎవరూ రాజధానిని తాకలేరు.

# ఇక అజేయం

-మొదటిపేజీ తరువాయి
శాశ్వత రాజధానిగా అమరావతి స్థిరపడిందని హర్షించారు. ఈ విజయం.. ఎన్డీఏ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదిగా అభివర్ణించారు. ఈ మేరకు పవన్‌కల్యాణ్ గురువారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. 'అమరావతి బిల్లు ఆమోదం పొందడమంటే కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదు, ఆత్మగౌరవ పునరుద్ధరణ! త్యాగాలతో నిర్మితమైన, సంకల్పంతో బలపడిన, లక్షల మంది కలలతో ముందుకు సాగుతున్న రాజధాని పునరుద్ధరణ. ఇకపై అమరావతికి సుస్థిరత వస్తుంది. ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుంది. ఇది ప్రజారాజధాని. భావితరాలకు మార్గదర్శకంగా నిలిచే వారధి' అని పవన్ పేర్కొన్నారు.

**వారి వ్యాఖ్యలను పట్టించుకోవద్దు**

రాష్ట్ర ప్రజలందరూ సంబరాలు చేసుకునే తరుణమిది. ఈ వేడుకల్లో జనసేన శ్రేణులు భాగస్వాములు కావాలి. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తూ అందరూ తమ ఇళ్లముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించాలి. అమరావతి బిల్లుకు మద్దతిచ్చిన రాజకీయ పార్టీలకు, ఎంపీలకు ధన్యవాదాలు. భవిష్యత్తులో ఎవరో వచ్చి ఏదో చేస్తారన్న అపోహలు వద్దు. అమరావతిపై ఇష్టంలేని వారి మాటలను పట్టించుకోవద్దు. అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. రాజధానిని ప్రతి ఒక్కరూ తమదని భావించేలా తీర్చిదిద్దే బాధ్యతను చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ ప్రయత్నంలో బలమైన తోడ్పాటు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు. అమరావతి అభివృద్ధిపై సీఎం చంద్రబాబుకు ఉన్న స్పష్టత, ఆయన చేస్తున్న కృషికి కృతజ్ఞతలు.

పెన్ సత్తా
శుక్రవారం 3 ఏప్రిల్ 2026

# ఆంధ్రప్రదేశ్ రాజధాని గా అమరావతి చట్ట బద్ధత పై హర్షం







**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:**ఆంధ్రప్రదేశ్ రాజధాని గా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం పట్ల ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ లు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, వి మాడుగుల, పెందుర్తి ఎమ్మెల్యే లు బండారు సత్యన్నారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ శాఖల జిల్లా అధికారుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నేతలు. అమరావతి రాజధాని బిల్లును పార్లమెంట్ ఉభయసభలు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు. అమరావతి బిల్లు ఏకగ్రీవంగా లోక్ సభ, రాజ్యసభ లలో ఆమోదం పొందడం ప్రజా విజయం. గత ఐదేళ్లు ఎన్నో అవస్థలు ఎదురొడ్డి పోరాడిన అమరావతి రైతులకు ఈ విజయం అంకితం అని కొల్లు రవీంద్ర రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డి ఆర్ సి ) జరిగింది.

సమావేశానికి ఇంచార్జి మంత్రి తో పాటు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పెందుర్తి, వి మాడుగుల, పెందుర్తి ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యన్నారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యన్నారాయణ రావు, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు, డి సిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి చట్టబద్ధత పై కలెక్టరేట్‌లో ఘన సంబరాలు..







అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02: అమరావతి రాజధానిగా చట్ట బద్ధత పొందిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా చట్ట బద్ధత పొందడం రాష్ట్ర అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రజల ఆశయాలను నెరవేర్చడమే కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని తెలిపారు. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమించి ఈ స్థాయికి చేరుకోవడం అందరి కలసికట్టైన కృషి ఫలితమని అన్నారు. అమరావతి అభివృద్ధి రాష్ట్రానికి ప్రగతిపథంలో మరింత వేగాన్ని తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని అందరూ కలిసి ఆనందంగా స్వాగతిస్తూ హర్షాతిరేకంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజధాని పై జగన్ ది విధానం లేని వైఖరి... నినాదం లేని నిర్ణయం

మాట మార్చడం, మడమ తిప్పడం  జగన్ అలవాటు.
అమరావతి పై జగన్ ద్వంద్వ వైఖరి బట్టబయలు.
గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.



**అమరావతి, ఏప్రిల్ 02:** రాష్ట్ర రాజధాని అంశంలో జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన విధానం లేకుండా, నినాదం లేకుండా గందరగోళ నిర్ణయాలు తీసుకుంటున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్రంగా విమర్శించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా ఒంటి మెట్టలో జరుగుతున్న సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం వంటి శుభసందర్భంలో, అమరావతి రాజధానికి చారిత్రకంగా మరింత బలం చేకూరుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటుండగా, కేంద్ర స్థాయిలో అమరావతి బిల్లుకు ముందడుగు పడుతుండటం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అన్నారు.

మాట మార్చడం, మడమ తిప్పడం  జగన్ నైజం, అమరావతి పై ద్వంద్వ వైఖరి దానికి నిదర్శనం. ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు అమరావతిని అంగీకరించి, అన్ని విధాలా అనుకూలమని చెప్పిన జగన్, తర్వాత మూడు రాజధానుల పేరుతో మాట మార్చాడు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఒక రోజు ఒక మాట, మరుసటి రోజు మరో మాట మాట్లాడటం జగన్ కుటిల రాజకీయాల అసలు స్వరూపం అని విమర్శించారు. అమరావతి సాధారణ ప్రదేశం కాదు, ఇది శాతవాహనుల రాజధాని, బౌద్ధ కేంద్రం, గౌతమ బుద్ధుడు సంచరించిన పవిత్ర స్థలం. అలాంటి చారిత్రక ప్రాముఖ్యత ఉన్న ప్రాంతాన్ని రాజధానిగా నిర్ణయించడం చంద్రబాబు దూరదృష్టి కి నిదర్శనం. కానీ జగన్ ఆ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేశారు అని పేర్కొన్నారు. దేశంలో ప్రతి రాష్ట్రానికి ఒక రాజధాని ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే మూడు రాజధానుల పేరుతో వైసీపీ గందరగోళం సృష్టిస్తోంది. ఇది ప్రజల అభివృద్ధి కోసం కాదు, జగన్ రాజకీయ లబ్ధి కోసం తీసుకున్న నిర్ణయం అని తెలియజేశారు. ప్రజా తీర్పే సమాధానం... అమరావతి శాశ్వత రాజధాని: 151 సీట్లు ఇచ్చి అందలం ఎక్కించిన ప్రజలు, వారిని (ప్రజలను) మోసం చేసిన వైసీపీ ని 11 సీట్లకు పరిమితం చేశారు. ఇదే జగన్ వైఖరికి ప్రజలు ఇచ్చిన గట్టి సమాధానం అని ఎద్దేవా చేశారు. లోక్ సభలో అమరావతి బిల్లుకు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడం, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒకే రాజధాని అవసరమని అంగీకరించడం, అమరావతి పట్ల దేశం చూపిన విశ్వాసం అని తెలిపారు. వైసీపీ ఎంపీలు వాక్ అవుట్ చేయడం ద్వారా ప్రజల ఆకాంక్షలను అవమానించారు. ఇది బాధాకరం అని అన్నారు. ఇక అమరావతిని ఎవరూ కదలించలేరు. కేంద్రం, రాష్ట్రం కలిసి చట్టబద్ధత కల్పిస్తున్నాయి. అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది అని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు.

# అమరావతికి చట్ట బద్ధత కల్పించడం రాష్ట్ర ప్రజలందరికీ శుభపరిణామం





**విజయవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** రూరల్ మండలం ప్రసాదంపాడులో రూ. 3.54 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ శక్తి కల్యాణ మండపం రోడ్డును ప్రారంభించిన విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ. అమరావతికి లోక్‌సభలో చట్ట బద్ధత కల్పించడం రాష్ట్ర ప్రజలందరికీ శుభపరిణామన్న ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు.

అమరావతికి చట్టబద్ధత వచ్చిన సందర్భంగా జాతీయ జెండాలు, కొవ్వొత్తులతో భారీ ర్యాలీ. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో రూ.3.54 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ శక్తి కల్యాణ మండపం రోడ్డును ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం అమరావతి రాష్ట్ర రాజధానిగా పార్లమెంట్‌లో ఆమోదం పొందిన సందర్భంగా జాతీయ జెండాలు చేతబట్టి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడం రాష్ట్ర ప్రజలందరికీ గొప్ప శుభపరిణామమని, ఇక పై అమరావతిని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ముక్తకంఠంతో ఈ బిల్లును స్వాగతించారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మినహా దేశంలోని అన్ని పార్టీలు మద్దతు పలికాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శిస్తూ, రాబోయే కాలంలో అమరావతి హైదరాబాద్, బెంగళూరు తరహాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజనలో పాత హామీలు అమలు కాక తొమ్మిది గ్రామాల ప్రజలు నిధులు, తాగునీటి సౌకర్యాల్లో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేస్తూ, కరెన్సీ నగర్ వరకు ఉన్న పైప్‌లైన్‌ను ఈ గ్రామాలకు విస్తరించి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారమని తెలిపారు. జలజీవన్ మిషన్ నిధులతో పరిమిత ప్రయోజనం మాత్రమే ఉంటుందని, విలీనంతోనే డ్రైనేజీ, చెత్త సేకరణ సమస్యలు తీరతాయని చెప్పారు. నున్న ప్రాంతంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండి రోజుకు 40--50 వేల మంది ప్రయాణించే మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, సీఆర్‌డీఏ ద్వారా రూ. 3.54 కోట్లు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించామని వివరించారు. గన్నవరం నియోజకవర్గానికి తగిన నిధులు అందడం లేదని, ఈ సమస్యలన్నింటినీ త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం మాత్రమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన అభివృద్ధి అని ఆయన పునరుద్ఘాటించారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ప్రసాదంపాడు గ్రామ సర్పంచ్ సర్నాల గంగారత్నం, ప్రసాదంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు పోలిశెట్టి రమణ, టిడిపి నాయకులు కోనేరు నాగేంద్ర కుమార్, బొప్పన హరికృష్ణ, కోనేరు పెదబాబు, గూడపాటి తులసిమోహన్, పొదిలి లలిత, దాసరి మహేష్, అద్దేపల్లి సాంబు, పట్టపు చంటి, సర్నాల బాలాజీ, బొమ్మసాని దుర్గారావు, కోనేరు సందీప్, మేడేపల్లి రమ, నెక్కంటి శ్రీదేవి, బుస్సే సరిత, బోడపాటి రవి, చల్లగాలి సునీల్, సొంగ సంతోష్, గంపా శ్రీనివాస్, శ్రీవిద్య, దాసరి శ్వేత, కొమ్మినేని బాబీ, పొదిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీ గా వేసవి కార్యచరణ ప్రణాళిక అమలు చెయ్యాలి.

- **సమీష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్దాం.**
- **జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేబాధ్యత అధికారుల పై ఉంది.**
- **జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర.**




**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగు నీరు సమస్య లేకుండా పకడ్బందీ గా వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు చెయ్యాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా కమిటీ (డి ఆర్ సి) సమావేశం జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగింది. త్రాగు నీరు, ఎల్ నినో, విద్యుత్, రహదారుల, మున్సిపాల్ శాఖల పై ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పెందుర్తి, వి మాడుగుల, యలమంచిలి ఎమ్మెల్యే లు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యన్నారాయణ మూర్తి, సుందరపు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ల తో కలిసి ఇంచార్జి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా జిల్లాలో త్రాగు నీరు సమస్య లేకుండా పక్క ప్రణాళిక తో అమలు చెయ్యాలన్నారు. జిల్లాలో కనీసం ఒక్క గ్రామంలో కూడ త్రాగు నీటి కొరత రాకుండా చర్యలు తీసుకువాలని, ఎల్ నినో ప్రభావం మన జిల్లాలో ఉంటుంది గనుక సంబందించిన శాఖ ల వారు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా అదకారులందరు సమన్వయం చేసుకొని స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధన కై కృషి చెయ్యాలన్నారు. ఇటీవల నక్కపల్లి లో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమాన్ని ఘన విజయం చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరికీ ధన్యవాదాలన్నారు. బడ్జెట్ ఔట్ రీచ్ కార్యక్రమంలో చర్చించిన మేరకు అవగాహన కల్పించండి. రాష్ట్రాన్ని 2047 లక్ష్యంతో పాలన సాగిస్తున్నాం. అధికారులు కూడా బాగా పని చేయాలి, ప్రజా ప్రతినిధులతో కలిసి అధికారులు పని చేయాలి. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్ర తలసారి ఆదాయ. తక్కువ ఉందన్నారు. తలసారి ఆదాయంలో మన జిల్లా మరింత వెనుకబడి ఉందన్నారు. జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, వినియోగం లోకి తీసురావాలన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాను వ్యవసాయ రంగం తోపాటు పారిశ్రామికంగా కూడా అభివృద్ధి బాటలో నిలిపేవిధంగా నియోజకవర్గ స్థాయిలో పారిశ్రామిక పార్క్ లు ఏర్పాటుచేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతీ మండలంలోనూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సమీష్టి కృషితో అభివృద్ధి పథంలో అనకాపల్లి జిల్లాను అన్నిరంగాల్లో ముందుంచేందుకు తాము శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. రైతాంగానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. పారిశ్రామికరంగ అభివృద్ధికి కూడా సమిష్టి కృషి చేస్తామన్నారు. పేదప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ముఖ్యంగా వేసవి దృష్ట్యా త్రాగునీరు, రోడ్లు, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యన్నారాయణ రావు, సీపీవో జి. రామారావు, నర్సీపట్నం, అనకాపల్లి ఆర్డీఓలు వివి రమణ, షేక్ అయిషా, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పోరాటం గెలిచింది.. అమరావతి శాశ్వతంగా నిలిచింది





- పార్లమెంటులో అమరావతి బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం హర్షణీయం.
- రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు.
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా విరాజిల్లుతుంది.
- మావిగన్ జగన్ రెడ్డికి దేశం పారాగన్ బుద్ధి చెప్పింది.
- జనసేన కార్యాలయం నుండి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:**
పార్లమెంటు ఉభయ సభలు అమరావతి బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం రాష్ట్ర ప్రజల, రైతుల విజయం అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. పట్టణం లోని జనసేన కార్యాలయం నుండి మహిళలు, యువత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఆంధ్రుల కల, అమరావతికి చట్ట బద్దత రావడం పట్ల రాష్ట్ర ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారు. ప్రధానంగా అమరావతి ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహిళలకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని కూడా లేని పరిస్థితుల్లో శివరామకృష్ణన్ కమిషన్ నివేదిక మేరకు విజయవాడ గుంటూరు మధ్య అమరావతిని రాజధానిగా ప్రకటించాం. చంద్రబాబు పై నమ్మకంతో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములిచ్చారు. దేశ వ్యాప్తంగా పుణ్య నదుల నుంచి నీరు, పుణ్యక్షేత్రాల నుంచి మట్టి తీసుకొచ్చి ప్రధానమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసాం. దిల్లీని మించిన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దామని ఆరోజు హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగా సచివాలయం అసెంబ్లీ హైకోర్టు సహా అనేక భవనాలను నిర్మించాం. ఫేక్ హామీలతో అధికారం లోకి వచ్చిన జగన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేయాలనుకున్నాడు. సౌత్ ఆఫ్రికా మోడల్ అంటూ వైజాగ్ అమరావతి కర్నూలులో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తానని దగా చేశాడు. ఐదేళ్లు అమరావతిలో రైతుల్ని హింసించాడు. దేవాలయాలకు వెళ్ళే మహిళా రైతులని అవమానించాడు. బూటు కాళ్ళతో మహిళల పొత్తికడుపులో తన్నించాడు. అమరావతి రాజధాని అని కోర్టులు తేల్చి చెప్పినా వినకుండా మూర్ఖంగా ప్రవర్తించాడు. 2024 ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై జగన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పి అమరావతి రాజధాని అని నినదించారు. 151 నుండి 11 కి పడేశారు. తాజాగా అమరావతి పై అసెంబ్లీలో తీర్మానానికి కూడా ఎగ్గొట్టాడు. ఈరోజు పార్లమెంటులో తీర్మానం పెడితే వైసీపీ ఎంపీలతో వాకౌట్ చేయించాడు. అమరావతి అంటే జగన్ రెడ్డికి ఎందుకింత కడుపు మంట.?, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని వికేంద్రీకరిస్తోంది. ఉత్తరాంధ్రలో అర్సలామెట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలను తీసుకొస్తున్నాం. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్, రాయలసీమలో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్, హార్టికల్చర్ అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లు అమరావతి పై కాల కూట విషం చిమ్మిన జగన్ నిన్న మావిగన్ అనే కొత్త పేరు చెప్పాడు. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్నాడు, ఇప్పుడు మావిగన్ అంటున్నాడు. పిచ్చి కి మందు పేరు మావిగన్ అయ్యుండచ్చు. అందుకే జగన్ రెడ్డికి ఆ పేరు గుర్తొచ్చి చెప్తున్నాడు. రాష్ట్ర అభివృద్ధి పట్ల విషం చిమ్ముతున్న జగన్ రెడ్డికి వారి పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవు. రాబోయే 25 సంవత్సరాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, పి.వి.జి.కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగ జగదీష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి పరమేశ్, బీజేపీ నాయకులు ముత్యాల వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు భీమరశెట్టి రాంకీ తదితర నాయకులు కార్యకర్తల భారీగా పాల్గొన్నారు.

# అతి త్వరలో అమరావతి అనే మహా నగరాన్ని మనం చూడబోతున్నాం.

- జగన్ మరింత దిగజారిపోయి.. జోకర్ గా మారిపోయాడు.
- అమరావతికి చట్ట బద్ధత పై సంబరాల్లో పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలు.
- చేనేతలకు ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలు అందజేసిన శ్రీరామ్.
- ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం.









**ధర్మవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 02:**
రాష్ట్ర ప్రజలు అతి త్వరలో అమరావతి అనే ఒక మహా నగరాన్ని చూడబోతున్నారని, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణం లోని 35 వ వార్డు లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేనేతలకు ఉచిత విద్యుత్ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వందలాదిమంది చేనేతలు పాల్గొన్నారు. ముందుగా పార్లమెంటులో అమరావతికి రాజధానిగా చట్ట బద్ధత కల్పించడంతో పాటు చేనేతలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం చేనేతలకు ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలను శ్రీరామ్ అందజేశారు. ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత వస్త్రాల డిజైనర్, జాతీయ అవార్డు గ్రహీత నాగరాజుకు ఇదే వేదిక పై శ్రీరామ్ సన్మానం చేశారు. చైనా లోని బీజింగ్లో జరిగిన వసంత్ మేళాలో ధర్మవరం ఖ్యాతిని చాటారని శ్రీరామ్ నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఐదున్నర కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్ష మేరకు అమరావతి ఇక శాశ్వత రాజధానిగా ఉండబోతుందన్నారు. 2014 నుంచి 2019 సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో క్లిష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే ఆ తర్వాత అధికారం లోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి మూడు ముక్కలాట పేరుతో రియల్ ఎస్టేట్ చేయాలని చూశారన్నారు. ఆరోజు రైతులను, మహిళలను రోడ్డు మీదకు లాగి ఎంతగా హింసించారో ప్రతి ఒక్కరూ చూశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమరావతి రైతులు నిర్వహించిన యాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు పలికారన్నారు. రైతులు చేసిన పోరాటం, వారి విషయంలో జగన్ వ్యవహరిస్తున్న దుర్మార్గపు వైఖరి గురించి అందరూ అర్థం చేసుకున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత ఒక ప్రణాళిక బద్ధంగా అమరావతి నిర్మాణం చేస్తున్నారన్నారు. ఇప్పటికీ కీలకమైన ల్యాండ్ మార్క్లు, రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. అక్కడ అభివృద్ధి ఎలా జరుగుతోందన్నది చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భవిష్యత్తులో అమరావతికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అమరావతికి అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటులో చట్ట బద్ధత కల్పించారన్నారు. ఇందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. కనీసం ఈ రెండేళ్లలో అయినా జగన్ బుద్ధి తెచ్చుకోకుండా మరింత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. అప్పట్లో మూడు రాజధానులని, ఇప్పుడు కొత్తగా మావిగన్ పేరుతో ఒక రాష్ట్ర రాజధానిని అపహాస్యం చేసే విధంగా మాట్లాడుతూ జోకర్ గా మారిపోయారన్నారు. అమరావతి రాజధానిగా చరిత్రలో నిలిచిపోతుందని, ఇందులో మనమంతా ఉన్నందుకు గర్వపడాల్సిన విషయం అని పరిటాల శ్రీరామ్ అన్నారు. చేనేతల పక్షాన నిలబడింది ఆ ఇద్దరు మాత్రమే.
రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా చేనేత వృత్తి పై ఆధారపడ్డారని గుర్తించిన మొదటి వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. అందుకే జనతా వస్త్రాలను అప్పట్లోనే ప్రోత్సహించారన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా చేనేతలను అనేక రకాలుగా ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీనివలన హ్యాండ్లూమ్ వారికి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు ఉంటుందని, దీని ద్వారా ఏడాదికి 8,500 రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. అదే పవర్ లూమ్ వారికి 500 యూనిట్లు చొప్పున ఏడాదికి 60 వేల రూపాయల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. ధర్మవరంలో 5,600 మంది హ్యాండ్లూమ్ కార్మికులకు, 780 మంది పవర్ లూమ్ కార్మికులకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారన్నారు. అయితే ఈ పథకం ఇంకా ఎవరికైనా వర్తించకపోతే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిబంధనల ప్రకారం మరోసారి వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీలైనంత ఎక్కువ మందికి పథకం వర్తించేందుకు తాను కూడా కృషి చేస్తానన్నారు. చేనేతలకు పింఛన్ సౌకర్యాన్ని కూడా మరింత ఎక్కువ మందికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక అందమైన చీర తయారీ వెనుక చేనేత కార్మికుని శ్రమ ఎంత ఉందో తాను కూడా ప్రత్యక్షంగా చూశానన్నారు. కచ్చితంగా అర్హత ఉన్న ప్రతి ఒక్క చేనేత కార్మికునికి పింఛన్ వచ్చేలా కూడా చూస్తామన్నారు. మరోవైపు చేనేత కార్మికుడు సొంతంగా తయారు చేసుకున్న చీరను, వారే ధర నిర్ణయించుకుని, విక్రయించుకునే విధంగా ప్రభుత్వ సహకారంతో ఒక దుకాణాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. ఇప్పటికే మంత్రి సవిత దృష్టికి దానిని తీసుకెళ్లామన్నారు. భవిష్యత్తులో షోరూం అది స్థాయికి కూడా ఎదిగే విధంగా చూస్తామన్నారు. మరోవైపు చేనేత క్లస్టర్ ద్వారా సామాన్య చేనేతలకు, భవిష్యత్తులో ఈ రంగంలోకి రావాలనుకునే వారిని ప్రోత్సహించే విధంగా ఉంటుందన్నారు. ఇక్కడ అత్యాధునిక డిజైన్లతో చీరలు తయారు చేయడం, సాంకేతికతను మరింత దగ్గర చేసే విధంగా శిక్షణ ఉంటుందన్నారు. ఈ క్లస్టర్ ద్వారా ధర్మవరం ప్రాంతం ఒక టూరిజం ప్రాంతంగా కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు..

## సంక్షేమ వసతి గృహాలు ఆకస్మిక తనిఖీ



**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** జిల్లాలో సంక్షేమ వసతి గృహలు నిర్వహిస్తున్న తీరుతోపాటు వసతిగృహాలలో జీరో వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమం అమలు తీరును ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. గురువారం ఉదయం పరవాడ మండలం, ప్రభుత్వ వెనకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వసతిగృహంలో జీరో వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఇంకుడు గుంతలను వసతి గృహంలో ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. తద్వారా నీటి ఎద్దడి నివారించు కోవచ్చన్నారు. కిచెన్ చుట్టూ గార్డెన్ పెంచడం తదితర కార్యక్రమాల పట్ల విద్యార్థులలో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిసిడబ్ల్యూఓ, ఎండిఓ, డీటీ, ఎబిసిడబ్ల్యూఓ, ఎంఈఓ, ఇతర మండలాధికారులు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయంలో వీణా నాదార్చన కార్యక్రమం





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:**
ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగ గుర్తింపు పొంది, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో గురువారం ఆలయ మండపంలో విశాఖపట్నం సరయు మ్యూజిక్ అకాడమీ ఆర్గనైజర్ వై ప్రశాంతి శిష్య బృంద సభ్యులు చే నూకాలమ్మ దేవస్థానంలో ప్రోగ్రామ్ కన్వీనర్ హరి లక్ష్మి ఆధ్వర్యంలో 60 మంది మహిళలు వీణా నాదార్చన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## మే 8 న అనకాపల్లి సినిమా విడుదల.




**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** మే 8 న అనకాపల్లి సినిమాను విడుదల చేయడం జరుగుతుందని ప్రముఖ దర్శకుడు నక్కిన త్రినాథ్ తెలిపారు. స్థానిక సన్ క్యాస్టల్ హోటల్లో గురువారం ఏర్పాటు చేసిన టీజర్ విజయోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో వ్య యప్రయాసలకు ఓర్చి మంచి కథతో రూపుదిద్దుకున్న అనకాపల్లి సినిమా టీజర్ కు రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా అనేక ప్రాంతాల నుండి అనూహ్య మైన స్పందన లభిస్తుందన్నారు. అనకాపల్లి ప్రాంతం లోనే ఈ సినిమాను 90 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అనకాపల్లి పై ఉన్న అభిమానంతో అదే అనకాపల్లి పేరుతో అదే అనకాపల్లి కి చెందిన కాంద్రేగుల నాయుడు నిర్మాతగా ఈ సినిమాను తెరకెక్కించడం జరిగిందన్నారు. అనకాపల్లికి నూకాలమ్మకు ఎంతో ప్రసిద్ధి ఉందన్నారు. అలాగే అనకాపల్లి బెల్లం వ్యాపారంలో దేశంలో రెండవ స్థానం ఆక్రమించిందన్నారు. అదే విధంగా రాజకీయంగా కూడా అనకాపల్లి ప్రజలను ఆకట్టుకుందని తెలిపారు. ఇప్పుడు అనకాపల్లి పేరుతో తెర కెక్కుతున్న సినిమా ప్రపంచ వ్యాప్తంగా మే 8 వ తేదీన విడుదల చేయడం జరుగుతుందని, అదే విధంగా గతంలో వలె అనకాపల్లికి మంచి పేరు ప్రఖ్యాతలు రావడం ఖాయమని తెలిపారు. విక్రమ్ సహదేవ్ హీరో గా, సంధ్య వశిష్ట హీరోయిన్ గా, తారక్ కొండప్ప విలన్ గా అద్భుతమైన నటన ప్రదర్శించారని తెలిపారు. తమ్మినేని కాగేష్ దర్శకత్వంలో అద్భుతంగా తెరకెక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా మల్ల సురేంద్ర మాట్లాడుతూ నక్కిన త్రినాథ్ దర్శకత్వంలో రూపొందిచిన చిత్రాలు సాధించిన విజయాలను వివరించారు. కచ్చితంగా అనకాపల్లి ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని అన్నారు అలాగే అనకాపల్లి కి చెందిన కొడుకుల శ్రీకాంత్ కథను రూపొందించడం మరో విశేషం అన్నారు. ఈ చిత్రాన్ని ప్రజలు విజయవంతం చేయాలని మరిన్ని సినిమాలు రూపొందించేందుకు అవకాశం కల్పించాలని ప్రేక్షకులుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహనిర్మాత కుమార్ రాజా, కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం వ్యవస్థాపకులు పీవీ రమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనారు. సాంకేతిక వర్గాన్ని సత్కరించారు.

## దొప్పెర్ల పాలకవర్గం పదవి విరమణ సమావేశం



**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఏప్రిల్ 02:**అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామంలో సర్పంచ్ కొరుపోలు చిన్నారావు ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం గ్రామ సచివాలయంలో పాలకవర్గంతో ప్రత్యేక సమావేశంను ఏర్పాటు చేశారు. అనంతరం సర్పంచ్ చిన్నారావు మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల కాలంలో తనకు చేదోడు వాదోడుగా ఉన్న వార్డు మెంబర్లు అందరికి ప్రత్యేక మైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పంచాయతీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించారని చెప్పారు. కష్టకాలంలో కూడా తనతో ఉన్నారని గుర్తు చేశారు. గత వైసీపీలో ఎన్నో కష్టాలు పడ్డామని, కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించారన్నారు. ఇటీవల కాలంలో పంచాయతీలో రూ.1.20 కోట్లతో 23 పనులు పూర్తి చేసుకోవడం జరిగిందని చెప్పారు. అభివృద్ధి చూసి ప్రజల సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. తన పదవీ కాలంలో సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పాత పెట్టుబడులపై పన్ను ఉండదు: సీబీడీటీ

పాత పెట్టుబడులపైనా పన్ను విధిస్తారనే పరిశ్రమ వర్గాల దీర్ఘకాలిక ఆందోళనలకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) పరిష్కారం చూపింది. 2017 ఏప్రిల్ 1కి ముందు చేసిన పెట్టుబడుల బదిలీ ద్వారా వచ్చే ఆదాయానికి 'గార్' (జనరల్ యాంటీ అవాయిడెన్స్ రూల్స్) వర్తించవని ఆదాయపు పన్ను విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు-2026ని సీబీడీటీ సవరించింది. విదేశీ మదుపర్లు పన్ను ఎగవేతలకు పాల్పడకుండా నిరోధించే లక్ష్యంతో 2012-13 కేంద్ర బడ్జెట్‌లో గార్ విధానాన్ని ప్రకటించారు. వాణిజ్యపరమైన వాస్తవికత లేని లావాదేవీల ద్వారా పన్ను ఎగవేతను అరికట్టేందుకు ఉద్దేశించిన ఈ నిబంధనలు 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ తేదీకి ముందు కొనుగోలు చేసిన పెట్టుబడులు, లావాదేవీలకు పన్నుల నుంచి మినహాయింపు (గ్రాండ్‌ఫాదరింగ్) కల్పించారు. రూల్ 128కి చేసిన తాజా సవరణతో గార్ గ్రాండ్‌ఫాదరింగ్ కింద ఉన్న అస్పష్టత తొలగిపోయిందని, 2017 తర్వాత వచ్చే పన్ను ప్రయోజనాల అన్వయంపై ఉన్న అనుమానాలు తీరి పెట్టుబడిదారులకు భరోసా లభిస్తుందని ఏకేఎం గ్లోబల్ పార్ట్‌నర్-ట్యాక్స్ సందీప్ సెహగల్ తెలిపారు. 2017 ఏప్రిల్ 1కు ముందు చేసిన పెట్టుబడుల బదిలీపై వచ్చే ఆదాయాన్ని గార్ పరిధి నుంచి మినహాయించినట్లు సీబీడీటీ ఇప్పుడు స్పష్టంగా పేర్కొనడంతో, పరిశ్రమల ఆందోళన తీరిందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ చెప్పారు.

## ఒరాకిల్‌లో ఉద్యోగం పోయిందని ఏడుస్తూ కూర్చోవద్దు.. కొత్త ఉత్సాహంతో అడుగులు వేయండి: బెంగళూరు సీఈఓ

టెక్ ప్రపంచంలో లేఆఫ్స్ కొన్నాళ్లుగా సర్వ సాధారణంగా మారాయి. ఒరాకిల్ ఇండియాలో 12వేల మంది ఉద్యోగులను తొలగించటం దేశంలోని ఐటీ కారిడార్లలో కలకలం రేపింది. అయితే ఉద్యోగం పోయిందనే ఆందోళనలో దిగులుగా ఉన్న టెక్కీలకు ధైర్యం చెబుతూ.. భవిష్యత్తులో కొత్త అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలనే మెసేజ్ బెంగళూరుకు చెందిన ప్రముఖ సీఈఓ ప్రదీప్ సౌందరరాజన్ పంచుకున్నారు. ఆయన తన లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో షేర్ చేసిన విషయాలు ప్రతి టెక్కీ కచ్చితంగా చదవాల్సిన అవసరం ఉంది. లేఆఫ్ కారణంగా జరిగిన నష్టం నుంచి ఎలా ముందుకెళ్లాలో టెక్కీలకు నేర్పిస్తోంది.

**గతాన్ని గౌరవించండి.. భవిష్యత్తు వైపు వెళ్లండి**

ఉద్యోగం పోవడం అనేది పర్సనల్ ఫెయిల్యూర్ కాదని.. అది కేవలం కంపెనీ నాయకత్వ మార్పులు, వ్యాపార వ్యూహాల వల్ల జరిగే ప్రక్రియన్నారు ప్రదీప్. అందువల్ల టెక్కీలు పాత కంపెనీలో గడిపిన సమయానికి కృతజ్ఞతగా ఉండాలని సూచించారు. అక్కడ నేర్చుకున్న పాఠాలను గుర్తుంచుకోవాలని.. కానీ ఆ ఆలోచనల్లోనే మిగిలిపోకూడదని అన్నారు. ఎమోషనల్ అయ్యి టైమ్ వేస్ట్ చేసుకోకుండా.. జరిగిన దాన్ని తీసుకుని రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగడమే అసలైన గెలుపని గుర్తుచేశారు.

**సరికొత్త సీవీకి శ్రీకారం..**

సాధారణంగా ఉద్యోగులు జాబ్ సెర్చ్ కోసం తమ పాత సీవీలనే అప్డేట్ చేస్తుంటారు. లేఆఫ్స్ వల్ల జాబ్ పోగొట్టుకున్న టెక్కీలు తమ అనుభవం గురించి 10 పేజీల సెల్ఫ్ రివ్యూ రాసుకోవాలని ప్రదీప్ చెబుతున్నారు. గత ఉద్యోగంలో మీరు సాధించినవి ఏంటి? ఎక్కడ ఫెయిల్ అయ్యారు? కొత్త జాబ్ వస్తే మీరు చేయబోయే మార్పులేంటి? అనే అంశాలను అక్కడ రాయాలన్నారు. ఇంటర్వ్యూ సమయంలో కేవలం రెజ్యూమ్ మాత్రమే కాకుండా.. ఇలాంటి వివరాలు పంచుకోవటం వల్ల మీ పట్ల కంపెనీలకు నమ్మకం పెరుగుతుందని చెప్పారు.

**చిన్న కంపెనీలే పెద్ద అవకాశాలు..**

పెద్ద పెద్ద కంపెనీల్లో సిస్టమ్స్ నెమ్మదిగా ఉంటాయని, అందుకే అక్కడ వృద్ధి మందగిస్తుందని అభిప్రాయపడ్డారు ప్రదీప్. ప్రస్తుతం మీకున్న స్కిల్స్ గుర్తించే చిన్న మధ్య తరహా కంపెనీలు, స్టార్టప్స్ వైపు వెళ్లటం బెటర్ అన్నారు. అక్కడ మంచి హోదా, శాలరీతో పాటు ఈక్విటీలు పొందే అవకాశం కూడా ఉంటుందని సూచించారు. అలాగే డెవలపర్లు, టెస్టింగ్ టీమ్స్, సేల్స్ టీమ్ వారు మిగిలిన పనులు నేర్చుకుంటూ మల్టీ-టాలెంటెడ్ గా మారొచ్చని చెప్పారు.

**పాత కష్టాలే కొత్త విజయాలు..**

ప్రదీప్ తన పర్సనల్ మెమట్నరీస్ పంచుకుంటూ.. తాను కూడా ఒకప్పుడు ఉద్యోగం పోయినప్పుడు ఇంటర్వ్యూలకు వెళ్లడానికి డబ్బులు లేక అప్పులు చేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. అవే కష్టాలు తనను ప్రస్తుతం ఒక కంపెనీకి సీఈఓగా నిలబెట్టాయని చెబుతూ.. మార్కెట్ పరిస్థితులు మారవచ్చు కానీ అవకాశాలు మాత్రం ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రతి ముగింపు ఒక కొత్త ఆరంభానికే అని అధైర్య పడొద్దంటూ సోషల్ మీడియాలో టెక్కీలకు బూస్టప్ ఇచ్చారు బెంగళూరు కంపెనీ సీఈఓ ప్రదీప్.

# ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పార్లమెంట్లో అమరావతి బిల్లు పాస్ కావడంపై హర్షం.
- కేంద్రానికి, ప్రధాని మోదీ కి, ఎంపీలకు మంత్రి సవిత ధన్యవాదాలు.
- రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు.
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి పరుగులు.
- అమరావతికి పార్లమెంట్ ఆమోదంతో పనిచేయని జగన్ మైండ్.
- మావిగన్ అంటూ పిచ్చి ప్రేలాపనలు.
- ఇక జన్మలో జగన్ కు అధికారం కల్ల మంత్రి సవిత.
- పెనుకొండలో మంత్రి సవిత నేతృత్వంలో అంబరాన్నంటిన సంబరాలు.











**పెనుకొండ, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** పార్లమెంట్ లో అమరావతి బిల్లు పాస్ కావడంతో, సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రపంచం మెచ్చుకోదగిన రాజధాని నిర్మాణం కాబోతోందని, స్వర్ణాంధ్రప్రదేశ్ కు బలమైన పునాదులు పడుతున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వెలిబుచ్చారు. అమరావతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర మంత్రులు అమిత్ షా కు, నిర్మలా సీతారామన్ కు, పార్లమెంట్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అమరావతికి పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, జగన్ మైండ్ పని చేయడం లేదన్నారు. నిన్నటి వరకూ మూడు ముక్కలాట ఆడిన జగన్, నేడు మావిగన్ అంటూ పిచ్చి ప్రేలాపన చేస్తున్నాడని మండి పడ్డారు. పిచ్చోడి చేతికి అధికారం ఇచ్చి ఏం జరిగిందో ప్రజలందరూ గమనించారని, భవిష్యత్తులో జగన్ కు ప్రజలు అధికారం ఇవ్వడం కల్లని అని అన్నారు. రాజ్యసభలో అమరావతి బిల్లుకు ఆమోదం లభించడంతో, మంత్రి సవిత నేతృత్వంలో గురువారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పట్టణ ప్రజలను, కూటమి నాయకులను, కార్యకర్తలను వుద్దేశించి మాట్లాడారు. నేడు నవ్యాంధ్రప్రదేశ్ కు శుభ దినమన్నారు. బుధవారం లోక్ సభలో, నేడు రాజ్యసభలో అమరావతికి బిల్లుకు వైసీపీ మినహా అన్ని పార్టీల ఎంపీలూ ఆమోదం తెలపడం ఆనందకరమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రపంచం మెచ్చదగిన రాజధానిగా అమరావతి ఆవిర్భవించ నుందన్నారు. ఇప్పటికే సైబారాబాద్ ను నిర్మించి హైదరాబాద్ ను ప్రపంచ పటంలో నిలిపిన ఘనత సీఎం చంద్రబాబు దేనన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కూర్చోడానికి సీటు కూడా లేదన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, సీమాంధ్రుల కలలు నెరవేర్చడానికి సీఎం చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంత్రి సవిత గుర్తు చేశారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి నడుం బిగించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి లోకేష్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా, తమ రాష్ట్రానికి రాజధాని ఉండాలన్న తపనతో, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వం మీద ఉన్న నమ్మకంతో అమరావతి ప్రాంత రైతులు ఉచితంగా 33 వేల ఎకరాలు ఇచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో రూపాయి కూడా ఖర్చు చేయకుండా వేల ఎకరాలు సేకరించడం సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు. పిచ్చోడి చేతికి రాయి దొరికినట్లు, అందివచ్చిన అధికారంతో జగన్ అమరావతిని, రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారన్నారు. ఆయన అసమర్థ పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. మూడు రాజధానులంటూ అమరావతికి భూములిచ్చిన రైతులపై, వారి మహిళలపై దాడులకు, వేధింపులకు దిగారన్నారు. అమరావతి ప్రాంత రైతుల త్యాగం వృథా కాలేదని, పార్లమెంట్ సాక్షిగా అయిదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధానికి చట్టబద్ధత లభించిందన్నారు. జగన్ ఈ జన్మకు అధికారం లోకి రాలేడు. అమరావతి పై జగన్ కుట్ర పన్నారని మంత్రి సవిత మండి పడ్డారు. రాజధాని పై రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. విపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి జై కొట్టిన జగన్, అధికారంలోకి రాగానే మాట మార్చేశారన్నారు. ఏపీలో మూడు రాజధానులంటూ రాష్ట్ర ప్రజలను మనోవేదనకు గురిచేశారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ లో అమరావతి బిల్లుకు ఆమోదం లభించడంతో, జగన్ మైండ్ పనిచేయడం లేదన్నారు. నిన్నటి వరకూ మూడు ముక్కలాట ఆడిన జగన్, ఇప్పుడు మావిగన్ అంటూ పిచ్చి ప్రేలాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ లో అన్ని పార్టీలూ అమరావతికి ఆమోదం తెలిపితే, వైసీపీ మాత్రం బాయ్ కాట్ చేసి విషం కక్కిందన్నారు. పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లు మరోసారి జగన్ కు ప్రజలు అధికారం ఇవ్వడానికి సిద్ధంగా లేరని అన్నారు. ఇక జగన్ భవిష్యత్తులో అధికారం లోకి రావడం కల్లని అని స్పష్టంచేశారు. పెనుకొండలో అంబరాన్నంటిన సంబరాలు. అంతకు ముందు పార్లమెంట్ ఉభయ సభల్లోనూ అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఆమోదం తెలపడం పై పెనుకొండ పట్టణంలో మంత్రి సవిత నేతృత్వంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. పట్టణం లోని అన్న క్యాంటీన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లారు. సీఎం చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సర్కిల్ వద్ద అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు నృత్యాలు చేస్తూ, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు తరలొచ్చారు.

# ప్రజలకు ప్రభుత్వ ఆర్థిక స్థితిగతుల పై అవగాహన అవసరం

- సంక్షేమానికి, అభివృద్ధికి వచ్చిన నిధుల వివరాల పై అవగాహన కలగాలి.
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అవగాహన చేసుకుని -- పరిమిత వనరులతో సమర్థవంతంగా పని చేయాలి.
- కలెక్టర్, శాసనసభ్యులకు సూచించిన జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర.
- బడ్జెట్ ను సక్రమంగా వినియోగించు కోవాలి మంత్రి వంగలపూడి అనిత








అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02: రాష్ట్ర బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమాలను రూపొందించు కోవాలని, కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించు కోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శాసనసభ్యులు, ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఇతర ఉన్నతాధికారులతో 2026-27 బడ్జెట్ -- ఔట్ రీచ్ అవగాహనా సదస్సును రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తో కలిసి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర నిర్వహించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, చేసిన బడ్జెట్ కేటాయింపులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ముందుగా బడ్జెట్ అవుట్ రీచ్ లక్ష్యాలు - జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు జిల్లా కలెక్టర్ వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి మధ్య సమతుల్యత పాటిస్తూ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొంటూ, అభివృద్ధి అంశాలకు, సంక్షేమ పథకాలకు సమన్యాయం చేస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ విశేషాలను, రంగాల వారీ కేటాయింపులను ప్రజలకు వివరించాలని, నియోజకవర్గాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి నియోజకవర్గాల వారీగా చేసిన కేటాయింపులపై స్థానిక శాసనసభ్యుల సమన్వయంతో ప్రత్యేక ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులకు తగ్గట్టు పనులు చేపట్టాలని, నిధులను సమృద్ధిగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఆర్సెల్లార్ మిత్తల్ సంస్థకు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ జిల్లాలో ప్రతి స్పెషల్ ఆఫీసర్ జిల్లా అభివృద్ధి పై జవాబుదారీగా ఉండాలని, ముఖ్యంగా వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం వల్ల నిధులు వృథా కాకూడదని జిల్లా మంత్రి పేర్కొన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ, నిధులు ల్యాప్స్ అవుతున్నాయని, దీనివల్ల క్షేత్రస్థాయిలో అభివృద్ధి కుంటుపడుతోందని హెచ్చరించారు.

రాష్ట్రం లోనే అనకాపల్లి జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని, ఒకవైపు సముద్ర తీరం (కోస్టల్ బెల్ట్), మరోవైపు వ్యవసాయం, ఇంకోవైపు పారిశ్రామిక రంగం. ఈ మూడింటి కలయిక ఉన్న ఏకైక జిల్లా అనకాపల్లి అని హోంమంత్రి పేర్కొన్నారు. ఈ సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో వ్యవసాయ, ఉద్యానవన రంగాలను లాభసాటిగా మార్చాలని, పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూనే, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ భూములను అభివృద్ధి కోసం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించు కోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా మంత్రిగా తన పూర్తి సహకారం ఉంటుందని, అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్సలర్ మిట్టల్ వంటి భారీ ప్రాజెక్టుల రాకతో జిల్లా భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, శాసన సభ్యులు కె ఎస్ ఎం ఎస్ రాజు, సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణ మూర్తి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, ఏపి ఆర్ డి సి కార్పొరేషన్ చైర్మన్ పి.నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొట్నీ బాలాజీ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాగితలో సర్పంచ్ సొంత నిధులతో నేతాజీ హరితవనం పార్క్ ఏర్పాటు





ప్రారంభించిన ఎంపీడీవో బి చైతన్య






**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** మండలంలో కాగిత గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ సొంత నిధులతో నేతాజీ హరితవనం(పార్క్ ) ఏర్పాటు చేశారు. రాజీవ్ పల్లె బాట రోడ్డు వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నేతాజీ హరితవనం(పార్క్ ) గురువారం గ్రామ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో ఎంపీడీవో బీ చైతన్య, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, పరిపాలన అధికారి సీతారామరాజు రిబ్బన్ కట్ చేసి పార్కును ప్రారంభించారు. గ్రామానికి చివర్లో సుమారు 10సెంట్లు ప్రభుత్వ భూములో ఈ పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. దీని నిర్మాణానికి చుట్టూ ఫెన్సింగ్, హెర్త్ వర్క్ గ్రామ పంచాయతీ నిధులను ఉపయోగించగా పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు సుమారు రూ 3.50 లక్షల వ్యయంతో గ్రామ సర్పంచ్ రాజేష్ సొంత నిధులు వెచ్చించి నేతాజీ హరితవనం పార్కును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్ రాజేష్ ను అధికారులు, గ్రామస్తులందరూ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి చైతన్య మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటుచేసిన ఈ పార్కు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రామ సర్పంచ్ ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ పార్కు ప్రజలకు ఆరోగ్య ప్రధాయినిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రతిరోజు మహిళలు కూడా ఈ పార్కును ఉపయోగించుకుని ఆరోగ్యవంతులు గా ఉండాలని ఆమె సూచించారు. సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ ఎప్పటినుండో గ్రామంలో పార్కు ఏర్పాటు చేయాలని సంకల్పించాలని అన్నారు. ఈ పార్కులో హరితవనంతో పాటు గ్రామస్తుల సహకారంతో కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే బుద్ధుని విగ్రహం కూడా పార్కులో ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన ప్రదేశంగా పార్కును తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడ ఇటువంటి పార్క్ లేదని దీనిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని గ్రామాల్లో ఇటువంటి పార్కులు ఏర్పాటు అవుతాయని ఆశిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి తో కలిసి అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





# హెచ్ఐవీ వ్యాప్తి నియంత్రణలో ఏపీ శాక్స్ పనితీరు భేష్

**2025-26లోని 9 నెలల పనితీరులో దేశం లోనే ఫస్ట్-న్యాకో వెల్లడి.**

**జైళ్లలో ఉండే ఖైదీలు, నిందితులకు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక దృష్టి**

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



**అమరావతి, ఏప్రిల్ 02:**
హెచ్ఐవీ కేసుల నియంత్రణ, బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ-ఏపీ శాక్స్) ఉత్తమ పనితీరు కనబరిచి, దేశం లోనే ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబరు (9 నెలలు) వరకు దేశం లోని ఎయిడ్స్ నియంత్రణ సంస్థల పనితీరును నాట్కో (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్) మదింపుచేసి, ఏపీ శాక్స్ తొలి స్థానంలో ఉందని తాజాగా ప్రకటించిందని, మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం నిర్దేశించిన 33 ఇండికేటర్లకు కలిపి 141కు 107 (75.9%) స్కోర్ సాధించి రాష్ట్ర శాక్స్ మిగిలిన రాష్ట్రాలను మించి తొలి స్థానానికి ఎగబాకిందన్నారు. 2024-25 లో ఇదే సమయంలో (ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు) రాష్ట్ర ఎయిడ్ నియంత్రణ సంస్థల పనితీరు పరిశీలించినప్పుడు ఏపీ ఏడో స్థానంలో ఉందని వెల్లడించారు. అదేవిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి ఏపీ శాక్స్ 12వ స్థానంలో ఉందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రతి త్రైమాసిక ర్యాంకింగ్ లో ఏపీ ముందంజలో ఉందని చెప్పారు.

2025-26 నుంచి రాష్ట్రంలో హెచ్ఐవీ కేసుల నియంత్రణ, బాధితులకు వైద్య సేవలు అందించడంలో కూటమి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా తీసుకున్న చర్యలవల్ల ఏపీ శాక్స్ పనితీరుకు నాట్కో నుంచి గుర్తింపు మొదలైంది. 2025-26లో తొలి త్రైమాసికం (ఏప్రిల్ నుంచి జూన్)లో ఏపీశాక్స్ రెండో స్థానంలో నిల్చోంది. రెండో (జూన్ నుంచి సెప్టెంబరు) త్రైమాసికంలో మాదిరిగానే మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు) లోనూ ఏపీ శాక్స్ తొలిస్థానంలో ఉంది. స్థూలంగా తొలి 9 నెలల ర్యాంకింగ్లో ఆంధ్రప్రదేశ్ పేరు తొలిస్థానంలో ఉంది న్యాకో తనకు ఉన్న మార్గదర్శకాల ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి దేశం లోని ఎయిడ్స్ నియంత్రణ సంస్థల పనితీరును సమీక్షించి, స్కోరుకార్డును క్యాములేటివ్ (అంతకుముందు నెలల పనితీరుతో కలిపి) విధానంలో ప్రకటిస్తోంది ఈ క్రమంలో 2025-26లో ఏపీ శాక్స్ గడిచిన 9 నెలల్లో ఉత్తమ పనితీరు కనబరిచి, మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. 33 కుగాను 25 ఇండికేటర్లలో ఏపీ ముందంజ.

సెంట్రల్, జిల్లా, సబ్-జైళ్లల్లో ఉండే ఖైదీలకు హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలను నిర్వహించడంలో ఏపీ ముందంజలో ఉంది అనాథ ఆశ్రమాలు, ట్రాఫికింగ్కి గురైన మహిళలు, జువైనెల్ హోమ్స్ (బాలల సంరక్షణ గృహాలు)లో ఉండే వారికి కూడా క్రమం తప్పకుండా హెచ్ఐనీ నిర్ధారణ పరీక్షలను ఏపీ శాక్స్ నిర్వహిస్తోంది. వీటి విషయంలో ఏపీ శాక్స్ నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించినట్లు నాట్కో ప్రకటించింది అలాగే హెచ్ఐవీ సోకేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్న హైరిస్క్ గ్రూపులతో పనిచేసే 36 స్వచ్ఛంద సేవా సంస్థలతో సమర్థంగా కార్యకలాపాలు నిర్వహింపచేయడంలో, మత్తు ఇంజెక్షన్లను వాడే వారికి చికిత్స అందించేందుకు డి-ఆడిక్షన్ కేంద్రాల నిర్వహణలో, జిల్లాల్లో ఉండే దిశ (పర్యవేక్షణ కేంద్రాలు) పనితీరు ప్రతిపాదికలోనూ ఉత్తమ స్కోరు లభించిందని ఏపీ శాక్స్ ఇంచార్జి ప్రాజెక్టు డైరెక్టర్ రోణింకి గోపాలకృష్ణ తెలిపారు హెచ్ఐవీ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా (76.9% తగ్గుదల) చూడడంలో ఏపీ మరింత ముందంజలో ఉందని చెప్పారు. 2010 నుంచి 2025 మధ్య హెచ్ఐవీ కేసులు వ్యాప్తి చెందకుండా నియంత్రించడంలో జాతీయ స్థాయిలో 48% తగ్గుదల ఉంది. ఇది రాష్ట్రంలో 76.9% వరకు ఉండడం గమనార్హం అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## మళ్లీ గోల్డ్ రేటు క్రాష్.. ట్రంప్ ప్రకటనతో బులియన్ మార్కెట్ షేక్




వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలకు మళ్లీ బ్రేక్ పడింది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఇరాన్పై భీకర యుద్ధం తప్పదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన ప్రకటన బులియన్ మార్కెట్ను ఒక్కసారిగా కుదిపేసింది. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.1,530 తగ్గింది. దీంతో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1,51,420కు చేరింది. ఆభరణాల తయారీకి వాడే పసిడి ధర రూ.1,400 మేర పతనమై రూ.1,38,800 వద్ద కొనసాగుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా భారీగా క్షీణించింది. కేజీ వెండి ధరపై ఏకంగా రూ.10,000 మేర కోత పడింది. దీంతో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,55,000 వద్ద ట్రేడ్ అవుతోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్పై దాడులు కొనసాగుతాయని చేసిన హెచ్చరికలతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. యుద్ధ భయాల నేపథ్యంలో డాలర్ ఇండెక్స్, బాండ్ ఈల్డ్స్లో మార్పులు రావడం, ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్కు మొగ్గు చూపడం వంటి కారణాలతో బంగారం ధరలు దిగివచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధర తగ్గడంతో సామాన్య ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## భారత టెలికాం సంచలనం.. 132 కోట్లకు చేరిన చందాదారుల సంఖ్య




భారతదేశ టెలికాం రంగం పరుగులు కొనసాగుతూనే ఉన్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 2026 చివరి నాటికి దేశంలోని మొత్తం టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 1,321.31 మిలియన్లకు (132.13 కోట్లు) చేరుకుంది. కేవలం ఫిబ్రవరి నెలలోనే రికార్డు స్థాయిలో 7.31 మిలియన్ల కొత్త చందాదారులు నెట్వర్క్లో చేరారు. బ్రాడ్బ్యాండ్ విభాగంలో చోటుచేసుకున్న భారీ వృద్ధి ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచినట్లు తెలుస్తుంది. దేశంలో బ్రాడ్బ్యాండ్ వినియోగదారుల సంఖ్య జనవరిలో 1,052.72 మిలియన్లు ఉండగా, ఫిబ్రవరి నాటికి అది 1,059.05 మిలియన్లకు పెరిగినట్లు సమాచారం. బ్రాడ్బ్యాండ్ మార్కెట్లో రిలయన్స్ జియో 519.64 మిలియన్ల చందాదారులతో తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు ట్రాయ్ నివేదిక స్పష్టం చేసింది. దీని తర్వాత భారతీ ఎయిర్టెల్ 364.14 మిలియన్లతో రెండో స్థానంలో ఉండగా, వొడాఫోన్ ఐడియా (129.36 మిలియన్లు), బీఎస్ఎన్ఎల్ (28.70 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక వైర్డ్ బ్రాడ్బ్యాండ్ విభాగంలో కూడా జియో (14.10 మిలియన్లు), ఎయిర్టెల్ (10.54 మిలియన్లు) ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దేశవ్యాప్త టెలి-డెన్సిటీ92.66 శాతానికి చేరుకోగా, పట్టణ ప్రాంతాల్లో ఇది అత్యధికంగా 142.32 శాతంగా నమోదైంది. వినియోగదారులు తమకు నచ్చిన నెట్వర్క్కు మారే ప్రక్రియ కూడా వేగంగా సాగుతోంది. ఫిబ్రవరి నెలలో ఏకంగా 14.47 మిలియన్ల మంది మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం. ప్రైవేట్ టెలికాం సంస్థలు మార్కెట్లో 92.59 శాతం వాటాతో ఆధిపత్యం చెలాయిస్తుండగా, ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వాటా 7.41 శాతానికి పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కనెక్టివిటీ పెరుగుతుండటం టెలికాం రంగ విస్తరణకు నిదర్శనంగా కనిపిస్తుంది.

## 98.45 శాతం రూ. 2 వేల నోట్లు వెనక్కి




చలామణీలో ఉన్న 98.45 శాతం రూ.2 వేల నోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) బుధవారం ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఇంకా రూ. 5,501 కోట్ల విలువ పెద్ద నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. 2023, మే 19న రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడే సమయానికి వ్యవస్థలో మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉన్నాయి. ఈ నోట్లను ఆర్బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. ఎవరి వద్దనైనా ఆ నోట్లు ఉంటే ఆర్బీఐ కార్యాలయాల్లో డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. 2023, అక్టోబర్ 9వ తేదీ నుంచి ఆయా నోట్లను వ్యక్తులు, సంస్థలు ఆర్బీఐ ఆఫీసుల్లో అందజేస్తే, ఆ మొత్తాన్ని వారి అకౌంట్లలో డిపాజిట్ చేసే అవకాశం కల్పించింది. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీసుల నుంచి కూడా ప్రజలు తమ వద్ద రూ. 2,000 నోట్లను ఆర్బీఐకి పోస్టల్ రూపంలో పంపి, తమ అకౌంట్లలో క్రెడిట్ చేయించుకొనే వీలు కల్పించింది.

# ఎడిటోరియల్

## అగ్రరాజ్యానికి ఆయుధమే ఆహారం..

ప్రపంచపటంలో తననుతాను 'ప్రజాస్వామ్య రక్షకురాలు'గా, 'శాంతి కాపలాదారు'గా చిత్రించుకునే అమెరికా అసలు రంగు యుద్ధం. అమెరికాకు ఆయుధమే ఆహారం, యుద్ధమే పెట్టుబడి. ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ చమురుతో కాదు, ఇతర దేశాల్లో చిందే రక్తంపై, ఆయుధాల అమ్మకాలపై ఆధారపడి నడుస్తోంది. శాంతిమంత్రం పైకి జపిస్తూనే, లోపల యుద్ధతంత్రాన్ని నడిపే అమెరికా వైఖరి మానవజాతికే ఒక కళంకం.'అమెరికా ఆయుధాలు తింటోంది' అనేది నేడు ఒక చేదు నిజం. అంటే.. అది కేవలం లోహపు ముక్కలను మింగడం కాదు; కోట్లాదిమంది అమాయకుల కలలను, పసిపిల్లల భవిష్యత్‌ను, స్వతంత్ర దేశాల సార్వభౌమత్వాన్ని పచ్చిగా నమిలి మింగుతోందని అర్థం. అమెరికాకు శాంతి అంటే ఒక నినాదం మాత్రమే. కానీ యుద్ధం అంటే ఒక భారీ లాభదాయకమైన వ్యాపారం.ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెట్టడం, ఆ మంటల్లో తన ఆయుధాల ఫ్యాక్టరీలను వేడి చేసుకోవడం ఆ దేశానికి వెన్నతో పెట్టిన విద్య. ఒక దేశంపై బాంబులు కురిపించాలన్నా, మరో దేశపు సార్వభౌమత్వాన్ని కాలరాయాలన్నా అమెరికాకు కావాల్సింది 'ప్రజాస్వామ్య రక్షణ' అనే ఒక అబద్ధపు సాకు. ఆ దేశపు క్షిపణులపై రాసి ఉండేది శాంతి సందేశం కాదు, రాబోయే వినాశనం తాలూకు ధర. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా, అది అమెరికా స్టాక్ మార్కెట్‌కు పండగే. శ్మశానాల మీద సౌధాలు నిర్మించుకునే వికృత ఆర్థిక వ్యవస్థ అమెరికాది.

డాలర్ విలువ పెరగాలంటే మరో దేశం రణరంగం కావాల్సిందే. మధ్య ప్రాచ్యం నుంచి ఐరోపా వరకు అమెరికా వేసిన ప్రతి అడుగు వెనుక చమురు వేట, ఆయుధాల అమ్మకం తప్ప మానవత్వం ఎక్కడా కనిపించదు. మందుగుండు సామాగ్రిని అమ్మడం కోసం శత్రువులను సృష్టించడం, ఆపై మధ్యవర్తిగా నటిస్తూ ఇరుపక్షాల రక్తాన్ని పీల్చడం - ఇదే వాషింగ్టన్ అనుసరిస్తున్న అసలైన 'వ్యూహాత్మక భాగస్వామ్యం'.అమెరికా ఆర్థిక వ్యవస్థకు యుద్ధం అనేది ఒక 'లైఫ్ సపోర్ట్' లాంటిది; అది ఆగిపోతే ఆ దేశపు జిడిపి వెంటిలేటర్ మీదకు వెళ్తుంది. లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్ వంటి సంస్థల షేర్లు పెరగాలంటే, మరో దేశంలో పసిపిల్లల హాహాకారాలు వినిపించాలి. శత్రువు లేకపోతే అమెరికా మనుగడ లేదు. అందుకే ఒకవేళ ప్రపంచంలో శత్రువు లేకపోతే, తన ఆయుధాలు అమ్ముకోవడం కోసం ఒక కొత్త శత్రువును తానే సృష్టించి, అతడిని ప్రపంచానికి విలన్‌గా పరిచయం చేస్తుంది. అమెరికా నేరుగా యుద్ధ రంగంలోకి దిగదు, కానీ యుద్ధం ఆగిపోనివ్వదు. దీనినే ఆ దేశం 'ప్రాక్సీ వార్' అని పిలుచుకుంటుంది. రష్యాను దెబ్బకొట్టడానికి ఉక్రెయిన్‌ను ఒక పావుగా వాడుకుంటూ, వేలకోట్ల విలువైన ఆయుధాలను సరఫరా చేస్తోంది. దీనివల్ల ఉక్రెయిన్ నాశనమవుతున్నా, అమెరికా ఆయుధ కంపెనీల లాభాలు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. అమెరికా తన యుద్ధోన్మాదంతో ప్రపంచదేశాలపై రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాయుధ, సాంకేతిక అణచివేతలకు పాల్పడుతుంది.సుమారు 800 బిలియన్ డాలర్లకు పైగా రక్షణ బడ్జెట్‌తో అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద సైనికశక్తిగా ఉంది. ఇది మిగతా టాప్ 10 దేశాల బడ్జెట్ కంటే ఎక్కువ. ప్రపంచ ఆయుధ ఎగుమతుల్లో సుమారు 40% వాటా అమెరికాదే. అభివృద్ధి చెందుతున్న దేశాలు సొంతంగా రక్షణ రంగంలో ఎదగకుండా ఆంక్షలు విధిస్తూ, ప్రపంచ దేశాలన్నీ సాంకేతికత కోసం తనపైనే ఆధారపడేలా చేసుకుంటుంది.

ఒకసారి అమెరికా ఆయుధాన్ని కొంటే, ఆ దేశం ఇక దశాబ్దాల పాటు అమెరికాకు బానిసగా ఉండాల్సిందే. ఇది రక్షణ ఒప్పందం కాదు, ఒక దేశంపై రుద్దే 'డిజిటల్, మిలిటరీ బానిసత్వం'. ప్రపంచ శాంతిని కాపాడాల్సిన ఐక్యరాజ్యసమితి, నేడు అమెరికా చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. తన ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ తీర్మానాన్ని అయినా అమెరికా తన 'వీటో' అధికారంతో తొక్కిపెడుతుంది. అణ్వాయుధ రాజకీయంలో అమెరికాది అందెవేసిన చెయ్యి. 'తుపాకీ గొట్టంద్వారా వచ్చే శాంతి శ్మశాన శాంతి మాత్రమే. అది ఎప్పటికీ శాశ్వతం కాదు. 'దీన్ని అగ్రరాజ్యాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా, చైనా తోపాటు ప్రపంచ దేశాలన్నీ గుర్తుంచుకోవాలి. శాంతి అనేది బాంబుల మోత ఆగినప్పుడు వచ్చే నిశ్శబ్దం కాదు.. అది ప్రతి మనిషి భయం లేకుండా బతికే స్వేచ్ఛ. అధికారం కంటే మానవత్వం, ఆయుధాల కంటే సహజీవనం గొప్పవని ప్రపంచ దేశాలు గుర్తించి, అమెరికా సృష్టిస్తున్న ఆయుధ విషవలయం నుండి, 'సాంకేతిక బానిసత్వం' నుండి బయటపడినప్పుడే భూమిపై నిజమైన శాంతి వెల్లివిరుస్తుంది. ఆయుధాలు లేని ప్రపంచమే రేపటి తరానికి మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి!

# బ్లాక్‌ప్లాస్టిక్ పెట్టెల్లో ఫుడ్ ప్యాక్ చేస్తున్నారా.?



రెస్టారెంట్లు, హోటల్లు, ఇతర ప్రదేశాలలో నల్ల ప్లాస్టిక్ కంటైనర్ల వాడకంపై భారతీయ జనతా పార్టీ రాజ్యసభ ఎంపీ ఘనశ్యామ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. నల్ల ప్లాస్టిక్ డబ్బాల్లోని ఆహారాన్ని మళ్లీ వేడి చేయడం సురక్షితమేనా? మార్చి 25, 2026న రాజ్యసభలో ప్రజా ప్రయోజన విషయాలపై తీవ్ర చర్చ జరిగింది. రెస్టారెంట్లు, హోటల్లు, ఇతర ప్రదేశాలలో నల్ల ప్లాస్టిక్ కంటైనర్ల వాడకంపై భారతీయ జనతా పార్టీ రాజ్యసభ ఎంపీ ఘనశ్యామ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంటైనర్లు సాధారణ ప్లాస్టిక్ కాదని, వాటిని రీసైకిల్ చేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. వాటిలో వేడి ఆహారాన్ని నిల్వ ఉంచితే, మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి చేరవచ్చని ఘనశ్యామ్ తివారీ తెలిపారు. దీనిపై నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నివేదికల ప్రకారం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పారిశ్రామిక ప్లాస్టిక్‌ను నిల్వ చేయడానికి నల్ల ప్లాస్టిక్‌ను తరచుగా ఉపయోగిస్తారు. దీనిని అగ్ని నిరోధకంగా చేయడానికి, డెకాబిడిఇ వంటి మంటలను ఆర్పే రసాయనాలను కలుపుతారు. సమస్య ఏమిటంటే, ఈ రసాయనాలు ప్లాస్టిక్‌కు పూర్తిగా అంటుకోవు. వేడి చేసినప్పుడు, ముఖ్యంగా ఆహారం వేడిగా , నూనెగా ఉన్నప్పుడు, అవి ఆహారంలోకి స్రవించగలవు. అంతేకాకుండా, ఈ ప్లాస్టిక్‌లో బిపిఎ, థాలేట్స్ వంటి రసాయనాలు కూడా ఉంటాయి. ఇవి హార్మోన్ల పనితీరును దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. మీరు అటువంటి పాత్రలలో ఆహారాన్ని వేడి చేసినప్పుడు లేదా వాటిని పదేపదే ఉపయోగించినప్పుడు, ఈ రసాయనాలు క్రమంగా శరీరంలో పేరుకుపోయి దీర్ఘకాలిక హానిని కలిగిస్తాయంటున్నారు వైద్యులు హెచ్చరిస్తున్నారు. 2024లో జరిగిన ఒక అధ్యయనం 200కు పైగా నల్ల ప్లాస్టిక్ ఉత్పత్తులను విశ్లేషించి, వాటిలో దాదాపు 85 శాతం ఉత్పత్తులలో విషపూరితమైన ఫ్లేమ్ రిటార్డెంట్లు ఉన్నట్లు కనుగొంది. ఈ రసాయనాలకు దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఃఖం, థాలేట్స్ వంటి మూలకాలు హార్మోన్ల అసమతుల్యతకు కారణం కావడమే కాకుండా, గుండె జబ్బులు, మధుమేహం, పునరుత్పత్తి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా పెంచుతాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, నల్ల ప్లాస్టిక్ నుండి విడుదలయ్యే మైక్రోప్లాస్టిక్‌లు కూడా శరీరంలోకి ప్రవేశించి విషభారాన్ని పెంచుతాయని, ఇది దీర్ఘకాలంలో వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావాలు మరింత తీవ్రంగా ఉండవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్‌తో దీనికి ప్రత్యక్ష సంబంధం ఉందని నిశ్చయంగా నిరూపించనప్పటికీ, ఇందులోని రసాయనాల పట్ల జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. నల్ల ప్లాస్టిక్ పాత్రలకు బదులుగా గాజు, స్టీలు, చెక్క పాత్రలను ఉపయోగించాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను, ముఖ్యంగా ఆహారాన్ని వేడి చేయడానికి, వాడకపోవడమే అత్యంత సురక్షితమైన పద్ధతి అంటున్నారు.

# ఎండాకాలం ఓ గ్లాసు తాగితే కూల్ కూల్..



వేడి వాతావరణంలో అలసట, డీహైడ్రేషన్ సమస్యలతో పాటు జీర్ణ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి బార్లీ నీరు ఒక సులభమైన, ప్రభావవంతమైన సహజ పరిష్కారం.. ఈ పురాతన ఆయుర్వేద పానీయం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలు, అనేక ఇతర ఆరోగ్య సవాళ్లకు బార్లీ నీరు ఒక పురాతన, సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. ఆయుర్వేదంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందించే అనేక ప్రయోజనాలను అందిస్తుంది. వాస్తవానికి బార్లీ నీరు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో (మెగ్నీషియం, మాంగనీస్, సెలీనియం, ఐరన్) నిండిన అద్భుతమైన ఆరోగ్య పానీయం.. ఇది మూత్రపిండాల ఆరోగ్యం, బరువు తగ్గడం, షుగర్ నియంత్రణ.. శరీరాన్ని డీటాక్సిఫై చేయడంలో సహాయపడుతుంది.

బార్లీ నీరు ఆరోగ్య ప్రయోజనాలు:జీర్ణక్రియ మెరుగుపడుతుంది: బార్లీ నీటిలో అధికంగా ఉండే డైటరీ ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌ను ప్రోత్సహిస్తుంది, ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది.. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. మధుమేహులు లేదా రక్తంలో చక్కెర నియంత్రణకు ప్రయత్నిస్తున్న వారికి ఇది చాలా ప్రయోజనకరమైనది. కొలెస్ట్రాల్ నియంత్రణ: బార్లీ నీరు శరీరం నుండి బైల్ యాసిడ్‌ను తొలగించడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. కాలేయం కొత్త బైల్ యాసిడ్‌ను తయారుచేయడానికి ఎక్కువ కొలెస్ట్రాల్‌ను ఉపయోగించేలా చేయడం ద్వారా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మూత్రనాళ ఆరోగ్యం: ఇది సహజమైన మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుంది.. మూత్ర ఉత్పత్తిని పెంచుతుంది. మూత్ర నాళాల నుండి విష పదార్థాలు, బ్యాక్టీరియాను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కాలేయానికి కూడా మేలు చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు బార్లీ నీటిలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవ సమతుల్యత, కండరాల పనితీరుకు చాలా అవసరం. వేడి వాతావరణం, శారీరక శ్రమ లేదా వ్యాయామం వల్ల కోల్పోయే ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయడంలో ఇది సహాయపడుతుంది. ఆయుర్వేదం ప్రకారం, బార్లీ నీరు వాత, పిత్త, కఫ అనే త్రిదోషాలను సమతుల్యం చేయగలదు. బార్లీ నీరు మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడానికి సులభమైన, పోషకాలతో నిండిన పానీయం. ఇది డీహైడ్రేషన్ నుండి జీర్ణక్రియ వరకు, కొలెస్ట్రాల్ నియంత్రణ నుండి ఎలక్ట్రోలైట్ సమతుల్యత వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

# పొద్దునే వేడి నీళ్లు తాగితే అద్భుతాలు జరుగుతాయా?



ఖరీదైన మందులు, సప్లిమెంట్స్ కంటే ప్రకృతి సిద్ధమైన ఇటువంటి చిన్న మార్పులు మన ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతాయి. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది వ్యూస్ సంపాదిస్తున్న ఈ వీడియోలలో ప్రజలు ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం, వేడి అల్పాహారం తీసుకోవడం మరియు చిన్నపాటి వ్యాయామాలు చేయడం కనిపిస్తుంది. దీనిని 'న్యాలీ చైనీస్' అని కూడా పిలుస్తున్నారు. నేటి కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతగా ఉందంటే, వేల ఏళ్ల నాటి సంప్రదాయాలు కూడా సరికొత్త 'ట్రెండ్స్' రూపంలో మన ముందుకు వస్తున్నాయి. 21 ఏళ్ల మరియమ్ ఖాన్ లాంటి ఎంతోమంది యువత ఇప్పుడు ఖరీదైన స్కిన్ కేర్ ప్రోడక్ట్స్ లేదా కఠినమైన వర్కవుట్స్ జోలికి వెళ్లకుండా.. ఒక చిన్న అలవాటును పాటిస్తున్నారు. అదే 'ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం'. చైనా సంప్రదాయ వైద్యం మరియు మన ఆయుర్వేదంలో ఎప్పటి నుంచో ఉన్న ఈ విధానం, ఇప్పుడు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో 'చైనా మ్యాక్సింగ్' పేరుతో వైరల్ అవుతోంది. వేల సంవత్సరాలుగా చైనీస్ మెడిసిన్, మన భారతీయ ఆయుర్వేద వైద్య విధానాల్లో వేడి నీటికి గొప్ప ప్రాధాన్యత ఉంది. ఉదయాన్నే వేడి నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణవ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. వేడి నీరు శరీర ఉష్ణోగ్రతను స్వల్పంగా పెంచుతుంది, దీనివల్ల చెమట పట్టి శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయి. గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి, శరీరమంతటా రక్త ప్రసరణ మెరుగ్గా జరుగుతుంది. ఇది కండరాల నొప్పులను కూడా తగ్గిస్తుంది. ప్రస్తుతం యువత ఈ పాత పద్ధతులకు ఆధునిక మెరుగులు దిద్దుతోంది. కేవలం నీళ్లే కాకుండా, వేడి వేడి అల్పాహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుందని వారు నమ్ముతున్నారు. ఈ వీడియోలు చూసి ఆధునిక యువత తమ జీవనశైలిని మార్చుకుంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది కేవలం మారుతున్న ఫ్యాషన్ కాదు. చల్లటి నీటి కంటే గోరువెచ్చని నీరు శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందని సైన్స్ కూడా అంగీకరిస్తోంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. అయితే, నీరు మరీ ఎక్కువగా మరిగించినది కాకుండా, గొంతుకు హాయిగా ఉండేలా 'గోరువెచ్చగా' ఉండటం ముఖ్యం. మరి మీరు కూడా రేపటి నుండి ఈ 'హాట్ వాటర్ ఛాలెంజ్' మొదలుపెడతారా?

# కోల్‌కతాపై సన్‌రైజర్స్ ఘన విజయం... ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన హైదరాబాద్

## 65 పరుగుల తేడాతో హైదరాబాద్ గెలుపు
## 20 ఓవర్లలో 226 పరుగులు చేసిన హైదరాబాద్
## 16 ఓవర్లలో 161 పరుగులకు కుప్పకూలిన కోల్‌కతా



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదిరిపోయే బోణీ కొట్టింది. తొలి మ్యాచ్ లో ఆర్సీబీ చేతిలో ఓడిన హైదరాబాద్ జట్టు నేడు స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 65 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకే కుప్పకూలింది.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48) ఆకాశమే హద్దుగా చెలరేగి పవర్‌ప్లేలోనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. అనంతరం హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52) హాఫ్ సెంచరీతో రాణించగా, తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (24 బంతుల్లో 39) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కోల్‌కతా బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ 4 వికెట్లు పడగొట్టాడు.

భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా తడబడింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (7 బంతుల్లో 28) మెరుపు ఆరంభం ఇచ్చినా, అది ఎక్కువసేపు నిలవలేదు. అంగ్‌క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 52) అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. రింకూ సింగ్ (35) అతనికి కొంత సహకారం అందించినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో కోల్‌కతా 16 ఓవర్లలోనే 161 పరుగులకు ఆలౌట్ అయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో జయదేవ్ ఉనద్కత్ 3 వికెట్లతో కోల్‌కతా పతనాన్ని శాసించాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, ఎషాన్ మలింగ చెరో రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

సన్ రైజర్స్ తన తదుపరి మ్యాచ్ ను ఏప్రిల్ 5న లక్నో సూపర్ జెయింట్స్ తో ఆడనుంది. ఈ మ్యాచ్ హైదరాబాద్ లో జరగనుంది.

# తండ్రి వ్యాఖ్యలపై స్పందించిన యువరాజ్ సింగ్.. ధోనీ, కపిల్‌కు సారీ!



భారత క్రికెట్ మాజీ ఆల్-రౌండర్ యువరాజ్ సింగ్, టీమిండియా మాజీ కెప్టెన్లు ఎంఎస్ ధోనీ, కపిల్ దేవ్‌లకు క్షమాపణలు చెప్పాడు. తన తండ్రి, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ గతంలో వారిపై చేసిన తీవ్రమైన, వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో యువీ ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, ఎంఎస్ ధోనీ వంటి దిగ్గజాలున్న జట్టులో యువరాజ్ కీలక ఆటగాడిగా వెలుగొందాడు. ముఖ్యంగా 2007 టీ20, 2011 వన్డే ప్రపంచకప్‌ల విజయాల్లో అతని పాత్ర మరువలేనిది.ఓ స్పోర్ట్స్ టాక్ పాడ్‌కాస్ట్‌కు సంబంధించిన టీజర్‌లో యువరాజ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "నేను కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీలకు క్షమాపణ చెప్పాలనుకుంటున్నాను" అని అందులో పేర్కొన్నాడు. తన తండ్రి ఇచ్చే ఇంటర్వ్యూల గురించి ప్రస్తావించినప్పుడు, "నాన్నా, అది కరెక్ట్ కాదు అని చెప్పాను" అంటూ యువరాజ్ తెలిపాడు. యువరాజ్ సింగ్‌కు భారత జట్టు కెప్టెన్సీ దక్కకపోవడానికి ధోనీనే కారణమంటూ యోగ్‌రాజ్ సింగ్ చాలా కాలంగా ఆరోపణలు చేస్తూ వస్తున్నాడు. ధోనీ వల్లే తన కుమారుడి కెరీర్ దెబ్బతిన్నదని పలు సందర్భాల్లో బహిరంగంగా విమర్శించాడు. ధోనీ నాయకత్వంలోనే యువరాజ్ తన కెరీర్‌లో అత్యధిక కాలం ఆడినప్పటికీ, యోగ్‌రాజ్ మాత్రం ధోనీపై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నాడు.

కేవలం ధోనీపైనే కాకుండా దిగ్గజ ఆల్-రౌండర్ కపిల్ దేవ్‌పైనా యోగ్‌రాజ్ సింగ్ గతంలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. 1980లలో తనను జట్టు నుంచి అకారణంగా తొలగించినందుకు కపిల్ దేవ్‌ను చంపాలనుకున్నానని

2025లో యోగ్‌రాజ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. పిస్టల్ తీసుకుని కపిల్ ఇంటికి వెళ్లానని, కానీ అక్కడ కపిల్ తల్లి ఉండటంతో వెనక్కి వచ్చానని ఆయన చెప్పడం అప్పట్లో పెను ప్రకంపనలు సృష్టించింది. ధోనీ, కపిల్ వంటి ఆటగాళ్లు ఇతరులను చెత్తలా చూశారని కూడా ఆయన ఆరోపించాడు. ఇలాంటి తీవ్రమైన వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే తన తండ్రి తీరుపై యువరాజ్ ఇప్పుడు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

# ఒకేసారి మూడు పాన్ ఇండియా చిత్రాలతో డార్లింగ్ రికార్డు!



ఏడాదికి ఒక సినిమా రిలీజ్ చేయడానికి స్టార్ హీరోలంతా కిందా మిదా పడుతున్నారు. అందులోనూ ఏక కాలంలో రెండు సినిమా షూటింగ్ లకు హాజరవ్వడం అంటే? హీరోల వ్యధలు ఇంకే స్థాయిలో ఉంటాయో చెప్పాల్సిన పని లేదు. అలాగని హీరోలందరి విషయంలో ఇది వర్తించదు. కొంత మంది హీరోలు షూటింగ్ ను అంతే వేగంగా పూర్తి చేయగల సమర్థులున్నారు. అయితే ఇక్కడ హీరోల కోణంలోనే చూడాల్సిన పనిలేదు. డైరెక్టర్ కూడా అంతే కీలకం. డెరెక్టర్ ఇచ్చే డైరెక్షన్ ని బట్టే షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది? సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్నది క్లారిటీ ఉంటుంది. ఈ విషయంలో చాలా మంది స్టార్ హీరోలందరికంటే డార్లింగ్ ప్రభాస్ ఎంతో మెరుగ్గా పనిచేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడిప్పుడే కొంత మంది స్టార్లు ప్రభాస్ ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు కదులుతున్నారు. తాజాగా డార్లింగ్ మరోసారి ఏక కాలంలో మూడు సినిమా షూటింగ్ లు పూర్తిచేస్తూ షెభాష్ అనిపిస్తున్నాడు. ప్రస్తుతం ప్రభాస్ ఏకకాలంలో -స్పిరిట్-, -ఫౌజీ-, -కల్కి 2- వంటి మూడు భారీ బడ్జెట్ పాన్-ఇండియా చిత్రాల షూటింగ్‌లలో పాల్గొంటూ రికార్డు సృష్టిస్తున్నారు. ఒకే సమయంలో మూడు భిన్నమైన ప్రపంచాలు, మూడు భిన్నమైన పాత్రలను హ్యాండిల్ చేయడం చిన్న విషయం కాదు. కానీ ప్రభాస్ తన అంకిత భావంతో సాధ్యం చేస్తున్నారు. రెండు..మూడు నెలలుగా -ఫౌజీ-, -స్పిరిట్- షూటింగ్ ల్లో నిర్విరామంగా డార్లింగ్ పాల్గొంటున్న సంగతి తెలిసిందే. -కల్కి 2- షూటింగ్ కూడా మొదలవ్వడంతో? ఆ సినిమా షూట్ కు వెళ్లడానికి రెడీ అవుతున్నాడు. ఇప్పటి వరకూ ప్రభాస్ లేని సన్నివేశాలను దర్శకుడు నాగీ చిత్రీకరించారు. కానీ ఇకపై డార్లింగ్ కూడా రెగ్యులర్ గా షూట్ కి హాజరు కావాల్సి సమయం ఆసన్నమైంది. దీంతో ప్రభాస్ షెడ్యూల్ మరింత టైట్ అవుతుందని తెలుస్తోంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో మరింత బిజీ అవుతారు. ఒక్కో సినిమాకు ఒక్కో రకమైన లుక్, బాడీ లాంగ్వేజ్ అవసరమవుతాయి. ఏ ఒక్క ప్రాజెక్టుకు ఇబ్బంది కలగకుండా ప్రభాస్ ముందుకెళ్లాల్సి ఉంటుంది. ప్రభాస్ లో కమిట్ మెంట్ చూస్తుంటే? వృత్తి పట్ల ఆయన గౌరవాన్ని తెలియ జేస్తోంది. గతంలో కూడా డార్లింగ్ -సలార్-, -కల్కి2898-, -ఆదిపురుష్- వంటి చిత్రాలను ఒకే సమయంలో బ్యాలెన్స్ చేశారు. అప్పుడు చేతిలో సమయం ఉండటంతో పెద్దగా ఇబ్బంది పడలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నాలిగింతలు అధికంగా శ్రమించాల్సి ఉంటుంది. నటుడిగా పాత్రల మధ్య తేడాను చూపిస్తూ, వేర్వేరు దర్శకుల విజన్‌కు అనుగుణంగా మారి పనిచేయాల్సి ఉంటుంది. ఇలా ఒకేసారి మూడు సినిమాలు పట్టాలెక్కించిన డార్లింగ్ ను నిజంగా మెచ్చుకోవాల్సిందే. ప్రభాస్ తో పోల్చితే షూట్ విషయంలో మిగతా పాన్ ఇండియా స్టార్లు ఎంతగా వెనుక బడుతున్నారు? అన్నది అద్దం పడుతుంది.



## సారా అర్జున్ అద్భుతమైన స్టైల్ స్టేట్‌మెంట్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com